

రాజమండ్రి శ్రీరాధాకృష్ణ కళాక్షేత్రం వారి నృత్య ప్రదర్శనలో ఓ దృశ్యం



రాజస్థాన్ వర్సెస్ కేరళ హాకీ పోటీలో...

హాకీ.. ఆహ్లాదం!

కాకినాడ క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు హోరాహోరీగా సాగుతోంది. శనివారం వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లు కలిసి మొత్తం 8 మ్యాచ్‌లు ఆడాయి. సాయంత్రం క్రీడాకారుల కోసం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. వివిధ రాష్ట్రాల కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. 6



మన ఊరి నుంచి మహా యాత్ర!

ఆర్టీసీ ప్రయాగ్‌ం అదుర్స్

- మహా కుంభమేళాకు వేలాది మంది..
- రైళ్లు, బస్సుల్లో తరలివెళ్లిన భక్తజనం
- అటు భక్తులకు సేవ.. ఇటు ఆదాయం

ప్రత్యేక కథనం 6

ఆలయాలకు తేజస్సు!





సకలేశ్వరస్వామి ప్రధాన ఆలయం

- కూటమి ప్రభుత్వం రాకతో జిల్లాలో పలు ఆలయాలకు మహర్దశ
- రూ.89.11 లక్షలతో పిఠాపురం సకలేశ్వరస్వామి ఆలయం పునర్నిర్మాణం
- వందేళ్ల నాటి ఆలయాన్ని తిరిగి వైభవంగా తీర్చిదిద్దేందుకు టెండర్లు
- రూ.53.18 లక్షలతో తలుపులమ్మ ఆలయంలో భారీ ఎస్కలేటర్లు
- కొండపైకి కాలినడకతో వెళ్లలేక భక్తులకు పాట్లు.. ఎస్కలేటర్లతో తీరనున్న బెంగ
- అన్నవరం ఆలయంలో రూ.25.32 కోట్లతో ఊపందుకున్న ప్రసాద్ స్కీం పనులు
- అటు గత వైసీపీ సర్కారు హయాంలో ఆలయాల అభివృద్ధి గాలికి

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఆలయాలకు మహర్దశ మొదలైంది. కూటమి ప్రభుత్వం రాకతో వీటికి నిధుల బెంగ లేకుండా కాసులు కురుస్తున్నాయి. గత వైసీపీ పాలనలో ఆలయాలపై దాడుల పరంపర కొనసాగగా, వీటి అభివృద్ధి సైతం పూర్తిగా పక్కన పడిపోయింది. భక్తుల సౌకర్యం కోసం ఏ చిన్న పనిచేయాలన్నా జగన్ సర్కారు పైసా కూడా విదల్చలేదు. దీంతో ఆలయాలన్నీ ఈసురోమన్నాయి. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం చిన్నా, పెద్ద దేవాలయాలను మరింత అభివృద్ధి చేసి భక్తులకు మరిన్ని సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా అడుగులు వేస్తోంది. ఎన్నో ఏళ్లుగా నిధులు లేకుండా నిరాదరణకు గురైన వాటిని మరింతగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. అందులోభాగంగా పిఠాపురం పట్టణంలోని సకలేశ్వరస్వామి ఆలయాన్ని రూ.89.11 లక్షలతో పూర్తిగా అభివృద్ధి చేయడానికి నడుంబిగించింది. వందేళ్లకుపైగా చరిత్ర ఉన్న ఈ ఆలయం పూర్తిగా పాడుబడిపోయింది. భక్తులకు సైతం ఇక్కడ సరైన సదుపాయాలు లేవు. అటు వందేళ్లదాటిన ఈ ఆలయం ఆలనాపాలనను గత ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసింది. ఈ నేపథ్యంలో దీన్ని పూర్తిగా పునర్నిర్మించాలని నిర్ణయించింది. అందుకోసం రూ.89.11 లక్షలు విడుదల చేస్తూ ఆదేశాలు జారీచేసింది. ఈనిధులతో మూలవిరాట్ చుట్టూ కొత్తగా పలు అభివృద్ధి పనులు చేయనున్నారు. ఆలయం, చుట్టుపక్క పరిసరాలు, క్యూలైన్ ఇలా అనేక పనులు చేపట్టడానికి వీలుగా ప్రభుత్వం ఇటీవల టెండర్లు కూడా పిలిచింది. రానున్న ఆరునెలల్లో వందేళ్ల నాటి ఈ ఆలయం సరికొత్తగా భక్తులను ఆకర్షించనుంది. అలాగే తుని మండలంలోని తలుపులమ్మ తల్లి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. అనేక జిల్లాల నుంచి భక్తులు ఇక్కడకు వందల్లో తరలివస్తారు. కానీ పెద్దకొండపైకి వెళ్లడం భక్తులకు నరకప్రాయంగా మారింది. వాహనాలపై వెళ్లినా సరే కొండపై భారీగా మెట్లు నడుచుకుని వెళ్లాల్సిన పరిస్థితి. ఈనేపథ్యంలో దాదాపు 85 మీటర్ల ఎత్తులో ఉన్న ఆలయంపైకి నేరుగా దిగువ నుంచి ఎస్కలేటర్లను నిర్మించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రూ.53.18 లక్షలతో కొత్తగా భారీ ఎస్కలేటర్ల నిర్మాణానికి టెండర్లు పిలిచింది. ఇది అందుబాటులోకి వస్తే భక్తులకు తిప్పలు తప్పనున్నాయి. అలాగే ఈ ఆలయంలో ప్రసాదం విక్రయాలకు సంబంధించి డొనేషన్ కౌంటర్ల నిర్మాణానికి రూ.1.68లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే యు.కొత్తపల్లి మండలంలోని జగన్నాథ సత్యనారాయణస్వామి ఆలయంలో పలు అభివృద్ధి పనులకు రూ.7.82 లక్షలు మంజూరయ్యాయి. ఇదిలాఉంటే ప్రసిద్ధ అన్నవరం ఆలయంపైనా అనేక అభివృద్ధి పనులు భారీగా ఊపందుకున్నాయి. ప్రసాద్‌స్కీం కింద అన్నవరం దేవస్థానానికి నిధులు కేటాయింపు జరిగినా గత వైసీపీ ప్రభుత్వం అసలు పట్టించుకోలేదు. కేంద్రం నిధులు ఇవ్వడానికి ముందుకు వచ్చినా రాష్ట్రప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వలేదు. దీంతో కొండపై ఏ పనీ మొదలవలేదు. అయితే కూటమి ప్రభుత్వం రాగానే ప్రత్యేక దృష్టిసారించడంతో ప్రసాద్ స్కీం కింద కేంద్రం నుంచి నిధులు విడుదలయ్యాయి. దీంతో రూ.25.32 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభానికి చకచకా అడుగులు పడుతున్నాయి. ఈ నిధులతో కొండపై భారీ అన్నదాన భవనం, క్యూకాంప్లెక్స్, రిటైనింగ్ వాల్, మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్ బస్సులు, చార్జింగ్ స్టేషన్లు నిర్మించనున్నారు. ఈ పనులు కూడా త్వరలోనే ప్రారంభం కానున్నాయి.

సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్లు



- తొలుత జిల్లా కేంద్రాల్లో అమలు
- ప్రత్యేక ఫీజుగా రూ.5 వేలు చెల్లించాలి
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డైనమిక్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టం అమలు
- స్లాట్ బుకింగ్‌కు ఫీజు నిల్
- క్యాన్సిల్ చేస్తే రూ.100, వాయిదాకు రూ.200

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

సెలవురోజుల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అనుకుంటున్నారా. ఆదివారాలు, సెలవురోజుల్లో క్రయ, విక్రయాల పూర్తికి ముహూర్తం వచ్చిందా. ఇక ఆలోచించనక్కర్లేదు. ఆ రోజుల్లోనే రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకు ప్రత్యేకంగా ఫీజును నిర్ధారించింది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు నేరుగా వచ్చి ఇబ్బంది పడకుండా ఉండేందుకుగానూ పనిదినాల్లో వారు కోరుకున్న సమయంలో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకునేందుకు వీలుగా డైనమిక్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టంను అమలుల్లోకి తీసుకువచ్చింది. కాకినాడ జిల్లాలో పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, సర్పవరం, తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట, తాళ్లరేవులతోపాటు జిల్లా కేంద్రమైన కాకినాడలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి ద్వారా నిత్యం వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఇప్పటివరకూ రిజిస్ట్రేషన్ల పక్రియ పూర్తికి స్లాట్ పద్ధతి పాటిస్తున్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లోకి వెళ్లిన తర్వాత వారు నిర్దేశించిన సమయానికే రిజిస్ట్రేషన్ స్లాట్ తీసుకుని ఆ సమయానికి వెళ్లవలసి వస్తోంది. ఆ సమయానికి రిజిస్ట్రేషన్ పక్రియ నిర్వహణలోనూ సమస్యలు ఎదురవుతున్నాయి. దీనివల్ల క్రయ, విక్రయదారులు గంటలు తరబడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద పడిగాపులు పడుతున్నారు. ఈ పక్రియ సంక్లిష్టంగా ఉండడంతో దళారులపై ఆధారపడాల్సి వస్తోంది. అదే విధంగా ఆదివారాలు, ఇతర సెలవురోజుల్లో మంచిరోజులు ఉన్నా రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి అవకాశం లేక సాధారణ రోజుల్లోనే చేయించుకోవాల్సి వస్తోంది. వీటన్నింటికి చెక్ పెట్టి ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు మరింతగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగానూ కొత్త జీవో ఒకటి జారీ చేసింది.

ఇక డైనమిక్ క్యూ

అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇక నుంచి డైనమిక్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టం అమలు చేయనున్నారు. దీని ప్రకారం క్రయ, విక్రయాలు, వివాహ రిజిస్ట్రేషన్లు, ఇతర లావాదేవీల నిర్వహణ పూర్తి చేసుకోవాలని భావించేవారు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమకు అనువైన సమయాన్ని ఎంపిక చేసుకుని స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. అందులో ఇచ్చిన అపాయింట్‌మెంట్ ప్రకారం నిర్దేశించిన సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని వెళ్లిపోయే అవకాశాన్ని కల్పించారు. దీనివల్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై వెలువెత్తుతున్న విమర్శలు, ఆరోపణలకు ప్రభుత్వం చెక్ పెట్టినట్లయింది. ఇప్పటి వరకూ అమలులో ఉన్న విధానంలో పలుకుబడి ఉన్నవారు ఎప్పుడు వచ్చినా వారికి నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసి పంపించడం, మిగిలిన వారిని వేచి చూసేలా చేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అదేవిధంగా శుభదినాల్లో ఎక్కువగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఇక నుంచి ఒక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గరిష్ఠంగా ఎన్ని రిజిస్ట్రేషన్లు జరగడానికి అవకాశం ఉందో అన్నింటికి మాత్రమే ముందస్తు అపాయింట్‌మెంట్లకు అవకాశం ఇస్తారు.

ఆన్‌లైన్‌లోకి వెళ్లి..

దళారులు, లేఖర్ల ప్రమేయాన్ని నూరు శాతం నిరోధించే లక్ష్యంతో ఆన్‌లైన్‌లో క్రయ, విక్రయదారులపై అన్ని వివరాలు నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ పక్రియ పూర్తి చేసుకునే విధానాన్ని మరింత సరళీకృతం చేశారు. ఆన్‌లైన్‌లో తమ ఆస్తులు లేదా ఇతర వివరాలు నమోదు చేసి డాక్యుమెంట్ తయారీని పూర్తి చేసిన వెంటనే దరఖాస్తు ఐడీ వస్తుంది. దీని ఆధారంగా స్టాంపు డ్యూటీ, ఇతర ఫీజులు చెల్లించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పూర్తికి స్లాట్ (అపాయింట్‌మెంట్) బుక్ చేసుకోవచ్చు. ఇది జరగగానే వారికి క్యూఆర్ కోడ్‌తో కూడిన యూనిక్ డిజిటల్ టోకెన్ వస్తుంది.

ఫీజులు నిల్

ముందస్తు స్లాట్ బుకింగ్‌కు ఎటువంటి ఫీజు చెల్లించనక్కర్లేదు. ఇది పూర్తిగా ఉచితమని ప్రభుత్వం ప్రకటించింది. అయితే స్లాట్‌బుక్ చేసుకుని రద్దు చేసుకుంటే మాత్రం రూ.100ను క్యాన్సిలేషన్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. అలాగే నిర్దిష్ట స్లాట్‌ను వాయిదా వేసుకుంటే రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. అదే ఎనీవేర్ రిజిస్ట్రేషన్ కోసం తాము ఏ రోజు ఈ ప్రక్రియ నిర్వహించాలని భావిస్తారో అంతకుముందు రోజు (పనిదినాల్లో) సాయంత్రం 4 గంటల్లోగా ఆ జ్యూరిడిక్షన్ సబ్‌రిజిస్ట్రార్‌కు ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుంది. ఇలా సమర్పించిన డాక్యుమెంట్లను పరిశీలించి అనుమతులివ్వాలని ప్రభుత్వం ఆదేశించింది.

సెలవు రోజుల్లో..

ఇప్పటివరకూ ఆదివారాలు, ఇతర సెలవు రోజుల్లో రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం లేదు. దీనివల్ల ఆ రోజుల్లో మంచి ముహూర్తాలు ఉన్నా, ఇతర ప్రాంతాల్లో వృత్తి, వ్యాపార, ఉద్యోగాల రీత్యా స్థిరపడి సెలవు రోజుల్లో వచ్చి రిజిస్ట్రేషన్ల పక్రియ పూర్తి చేసుకుందామని భావించే వారికి వీలులేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణ రోజుల్లో వచ్చి తమ పని పూర్తి చేసుకుంటున్నారు. ఇటువంటి వారికోసం ప్రభుత్వం ప్రత్యేక అవకాశం కల్పించింది. ఆదివారాలతోపాటు పబ్లిక్ హాలీడేల్లో రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవాలని భావించేవారు ముందురోజు సాయంత్రం ఐదు గంటల్లోగా స్లాట్ బుక్ చేసుకోవాలి. ఇందుకుగానూ హాలీడే రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.5 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ విధానాన్ని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు రిజిస్ట్రేషన్ జిల్లా కేంద్రాల్లో అమలు చేయనున్నారు. ఈ విధానం విజయవంతమైతే దశలవారీగా అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలుచేస్తారు.

ఇబ్బందుల పరిష్కారమే లక్ష్యంగా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో పలు సంస్కరణలు తీసుకువచ్చింది. తొలుతగా సబ్ రిజిస్ట్రార్‌లకు ప్రత్యేకంగా ఉన్న కోర్టు తరహా చాంబర్‌ను తొలగించి అన్ని కార్యాలయాల్లో మాదిరిగానే కూర్చొనే ఏర్పాట్లుచేసింది. ఇప్పుడు రిజిస్ట్రేషన్ పక్రియను ప్రజలు కోరుకున్న రోజున, తమకు అనుకూలమైన సమయంలో పూర్తి చేసుకునే అవకాశం కల్పించింది. వారు తీసుకున్న ప్రీఅపాయింట్‌మెంట్ సమయంలో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ పూర్తిచేసి పంపాల్సిన బాధ్యత సబ్‌రిజిస్ట్రార్‌లపై ఉంటుంది. దీంతో గంటల తరబడి కార్యాలయాల వద్ద వేచి చూసే ఇక్కట్లు తొలగి అరగంట వ్యవధిలోనే ప్రక్రియ పూర్తిచేసుకునే అవకాశం ఉంటుంది.

నిధులకు.. ఉదయమేదీ!



కాకినాడ ఎంపీ గారూ.. ఇదీ తీరు!

- గతేడాది రూ.5 కోట్లు విడుదల
- ఖజానాకే పరిమితమైన నిధులు
- నేటికీ ఖర్చు చేయని ఎంపీ
- ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలు
- నేటికీ స్పందించని వైనం
- ఏప్రిల్‌లో మరో రూ.5 కోట్లు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ పార్లమెంటు నియోజకవర్గంలో వింత పరిస్థితి నెలకొంది. ఎంపీ లాడ్స్ నిధులు ఉన్నప్పటికీ అభివృద్ధి పనులకు కేటాయించడంలేదు.ఇతర నియోజకవర్గాల్లో నిధులు లేక అభివృద్ధి పనులు చేయలేకపోతుంటే ఇక్కడ పరిస్థితి భిన్నంగా ఉంది. చివరకు ప్రజాప్రతినిధులు ఇచ్చిన ప్రతిపాదనలు సైతం బుట్టదాఖలు కావడం విశేషం. దీంతో ఏడు నెలలుగా నిధులు ఖజానాలోనే మూలుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది జూలై నెలలో కాకినాడ పార్లమెంటు నియోజకవర్గానికి ఎంపీ లాడ్స్ కింద రూ.5 కోట్లు విడుదలయ్యాయి.ఈ నిధులు 18వ లోక్‌సభలో 2024-25 సంవత్సరానికి కేంద్రం విడుదల చేసింది. ఈ నిధులతో కాకినాడ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఉన్న కాకినాడ అర్బన్, కాకినాడ రూరల్, పిఠాపురం, తుని,జగ్గంపేట, పెద్దాపురం,ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేయాలి. అయితే ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడంతో నిధులున్నప్పటికీ అభివృద్ధికి గ్రహణం పట్టింది.

ఏప్రిల్‌లో మరో రూ.5 కోట్లు

ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీన మరో రూ.5 కోట్లు కేంద్ర ప్రభుత్వం 2025-26 సంవత్సరానికిగాను విడుదల చేయనుంది. అయితే గతేడాది విడుదల చేసిన నిధులనే వినియోగించలేదు. కొత్తగా వచ్చే నిధులతో ఏం చేస్తారో తెలియడం లేదని పలువురు పెదవి విరుస్తున్నారు.

క్రతువు అంతా ఆన్‌లైన్‌లోనే

ఎంపీ లాడ్స్‌కు సంబంధించిన లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లో చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం రూల్స్ విధించింది. పనుల ప్రతిపాదనల దగ్గర నుంచి వాటి ఆమోదం, బిల్లుల చెల్లింపు వరకు ఆన్‌లైన్‌లోనే జరుగుతాయి. పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, డ్రైనేజీ, విద్యుత్‌శాఖల ద్వారా చేపట్టే పనులకు రూ.5 లక్షల వరకు నామినేషన్ పద్ధతిలో పనులు అప్పగిస్తారు. నగరాలు, పట్టణాలు, నగర పంచాయతీల్లో రూ.లక్ష వరకే నామినేషన్‌పై పనులు అప్పగించాలి. రూ.లక్ష దాటితే టెండర్లు పిలవాలనే నిబంధన ఉంది. ఈసారి కేంద్రం ప్రత్యేక అవకాశం కల్పించింది. గతంలో పనులు చేపట్టి నిధులు లేకపోవడం వల్ల మధ్యలో నిలిచిపోతే ఈ నిధులు కేటాయించే అవకాశం కల్పించింది.

గత వైసీపీలో అధ్వానం

గత ఐదేళ్ల వైసీపీ హయాంలో ఎంపీ లాడ్స్ నిధులతో చేసిన పనులు అధ్వానంగా ఉన్నాయి. గత వైసీపీలో కాకినాడ ఎంపీకి రూ.20 కోట్లతో పనులు చేపట్టే అవకాశం కల్పించింది. అయితే పనులను సకాలంలో పూర్తి చేయలేకపోయారు. రూ.20 కోట్లతో 361 పనులు ప్రతిపాదించారు. 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి కేవలం రూ.10 కోట్లతో 156 పనులను మాత్రమే పూర్తి చేశారు. ఇంకా రూ.10 కోట్లతో 165 పనులను పెండింగ్‌లో ఉంచేశారు. సార్వత్రిక ఎన్నికల ముందు అప్పటి ఎంపీ హడావుడిగా శంకుస్థాపన చేసి వదిలేశారు.

ఆరుగురు ఎమ్మెల్యేల ప్రతిపాదనలు

కాకినాడ పార్లమెంటు నియోజకవర్గంలో తమకు నిధులు కేటాయించాలని ఇప్పటివరకు ఆరుగురు ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది. వివిధ కారణాలను సాకుగా చూపుతూ వాటిని బుట్టదాఖలు చేస్తున్నట్టు సమాచారం. దీనివల్ల నియోజక వర్గాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఆవేదన చెందుతున్నారు. ప్రతిపాదనలను పరిశీలించి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రాధాన్యత ప్రకారం ఖర్చు చేస్తాం..

కాకినాడ పార్లమెంటు పరిధిలో ఈ నిధులను ప్రాధాన్యత ప్రకారం వెచ్చించి అభివృద్ధి పనులు చేస్తాం. 7 నియోజకవర్గాల నుంచి వచ్చే ప్రతిపాదనలను పరిశీలించి రోడ్లు, డ్రైన్లు, ప్రభుత్వ భవనాలు వంటివి నిర్మిస్తాం. ఎంపీ నిధులు మురిగిపోయే అవకాశం లేదు. అభివృద్ధి పనులు వేగంగా చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నాం.

- ఉదయ్‌శ్రీనివాస్, కాకినాడ ఎంపీ





హాజరైన పోలీస్ అధికారులు... సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

ఫిర్యాదు చేస్తే రశీదు ఇవ్వాల్సిందే : ఎస్పీ

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏదో ఒక సమస్యతో తప్పని పరిస్థితుల్లో సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులు ఫిర్యాదుచేస్తే రశీదు ఇవ్వాల్సిందేనని ఎస్పీ జి.బిందుమాధవ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఆయన జిల్లా పోలీస్ కార్యాలయ, సమావేశ మందిరంలో జిల్లావ్యాప్తంగా ఉన్న పోలీస్ అధికారులతో శనివారం నెలవారీ నేర సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో ఫిర్యాదు చేయడానికి సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల అక్కడ సిబ్బంది, అధికారులు మర్యాదపూర్వకంగా మెలగుతూ వారి సమస్యను సాధ్యమైనంత త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా మహిళల, చిన్నపిల్లల రక్షణకోసం హెల్ప్‌లైన్ నెంబర్లను బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేసేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా కాకినాడ, పెద్దాపురం సబ్‌డివిజన్ల పరిధిలో నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్, ఆస్తి సంబంధిత నేరాలు, ఇతర కేసుల నమోదు, వాటిని ఛేదించే విషయాలపై స్టేషన్ల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించి సీడీ ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలను అధికారులు తప్పనిసరిగా ఎప్పటికప్పుడు సందర్శిస్తూ నిఘాను పటిష్ఠం చేయాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి పోలీస్‌స్టేషన్‌కు ఒక డ్రోన్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కర్‌రావు, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, కాకినాడ ఎస్‌డీపీవో, ఐపీఎస్ అధికారి మనీష్ దేవరాజ్ పాటిల్, పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, ఎస్బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడే గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష : డీఆర్వో

కలెక్టరేట్(కాకినాడ),ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి):ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష ఆదివారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, అలాగే మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. కాకినాడ జిల్లాలో ఆదిత్య యూనివర్సిటీ సూరంపాలెం, కాకినాడ జేఎన్‌టీయూ, వీఎస్‌లక్ష్మి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆర్‌టీవో ఆఫీసు రోడ్డు, ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల లక్ష్మీనారాయణ నగర్, ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల సాంబమూర్తి నగర్‌లో నిర్వహిస్తామన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 8.30 నుంచి 9.30 వరకు, గ్రేస్ పీరియడ్ 15 నిమిషాల వరకు, అలాగే మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 వరకు గ్రేస్ పీరియడ్ 15 నిమిషాల వరకు మాత్రమే పరీక్ష కేంద్రాలకు అనుమతించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

టమాటాకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అధికారులు చర్యలు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): టమాటా పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈమేరకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాలో పంట పొలాల వద్దనే టమాటాలను రూ.8కి కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఎవరైనా రైతులు టమాటా పండించి ధర రాకపోతే దగ్గరలో ఉన్న రైతు బజారుకి తీసుకువచ్చి ఎస్టేట్ అధికారిని సంప్రదిస్తే వారికి నేరుగా రైతు బజారులో అమ్ముకునే సౌకర్యం కూడా కల్పించబడుతుందని అధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్లు కోరారు.

మన ఊరి నుంచి మహా యాత్ర

ఆర్టీసీ ప్రయాగ్‌ం అదుర్స్

అమలాపురం/రాజమహేంద్రవరం అర్బన్/ కార్పొరేషన్ (కాకినాడ) / కొవ్వూరు/నిడదవోలు/ ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):



కుంభమేళాకు ఎన్నడూ లేనంతగా వేలాది సంఖ్యలో ఈసారి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి భక్తులు తరలివెళ్లారు. ఇది 144 సంవత్సరాలకు ఒకసారి వచ్చేదని ప్రచారం జరగడంతో దీనిపై మరింత ఆసక్తి పెరిగింది. దీనికనుగుణంగా తప్పనిసరిగా కుంభమేళాకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించాలని జనం భావించారు. ఎంతో దూరం, మరెంతో వ్యయప్రయాసలైనప్పటికీ భక్తులు వెళ్లారు. రైళ్లలోను, బస్సుల్లోనూ ఈ ప్రయాణాలు చేసేందుకు అందరూ ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రత్యేక రైళ్ల వేయడంతో కొంతవరకు ఈ మార్గాన వెళ్లారు. అయితే చాలా మంది బస్సుల్లో తీర్థయాత్రల మాదిరిగా వెళ్లడానికి ఆసక్తి చూపారు. దీనికి ప్రధాన కారణం ఏపీఎస్ ఆర్టీసీయే. సాధారణంగా పండుగల్లో స్పెషల్ సర్వీసులు నడపడం ఆర్టీసీకి కొత్తేమీ కాదు. పంచారామ క్షేత్రాల దర్శనాలకూ సర్వీసులు నడుపుతారు. కానీ కొద్దికాలంగా ఆర్టీసీ అధికారులు వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకునేందుకు డిపోల వారీగా పోటీ పడుతున్నారు. అరుణాచలం గిరి ప్రదక్షిణలకు ప్రతి నెలా సర్వీసులు నడుపుతున్నారు. ఏకాదశ రుద్రుల దర్శనం పేరిట కొవ్వూరు డిపో నుంచి వంద బస్సులకు పైగా ప్రత్యేక సర్వీసులు నడిపారు. ఇలా ప్రతి సందర్భాన్ని ఆర్టీసీ యాత్రల పేరిట సర్వీసులు నడపడం విశేషం. ఇందులో భాగంగానే కుంభాభిషేకానికి ప్రత్యేక సర్వీసులను పెద్దఎత్తున నడిపారు. వేలాది కిలోమీటర్ల మేర సర్వీసులు నడపడం అంటే ఆషామాషీ కాదు. యాత్ర బస్సు అంటేనే భోజన, వసతి సౌకర్యాలు సైతం సమకూర్చాలి. ఎలాంటి ఇబ్బందులు ప్రయాణికులకు కలుగకుండా నడపాలి. ఈసారి కుంభమేళాలో ఆర్టీసీ సర్వీసులకు ఎంతో ఆదరణ దక్కింది. భోజన, వసతి సదుపాయాల్లో చక్కటి సౌకర్యాలు సంతృప్తి కలిగించాయి. టిక్కెట్టు ధర కూడా రూ.10,800 నుంచి రూ.12500 మధ్య అందుబాటులోనే ఉండడం మరింత వెసులుబాటు కలిగించింది. ఇన్ని సౌకర్యాలు కల్పిస్తూనే ఆర్టీసీ కూడా తమ ఆదాయాన్ని గణనీయంగా పొందడం మరో విశేషం.

కోనసీమ జిల్లాలో రూ.97 లక్షల ఆదాయం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు వేలాది మంది భక్తులు తరలి వెళుతున్నారు. రైళ్లు, విమాన ప్రయాణాలతోపాటు ఆర్టీసీ బస్సుల ద్వారా కూడా భారీ సంఖ్యలో ప్రజలు కుంభమేళాకు వెళ్లి పవిత్ర పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. జిల్లా పరిధిలోని అమలాపురం, రాజోలు, రావులపాలెం, రామచంద్రపురం బస్ డిపోల నుంచి ఇప్పటి వరకు 25 బస్సుల్లో 900 మంది ప్రయాణికులు కుంభమేళాకు వెళ్లారు. ఈ యాత్రకు ఆర్టీసీ సూపర్‌లగ్జరీ వీడియో కోచ్‌లు ప్రయాణికుల కోసం ఏర్పాటుచేసింది. మొత్తం 14 ప్రాంతాల్లోని పుణ్యక్షేత్రాల్లో ముఖ్యమైనవి వారణాశి, అయోధ్యతోపాటు ప్రయాగరాజ్‌లో త్రివేణి సంగమ పుణ్యస్నానాలు చేస్తున్నారు. ఒక్కొక్క ఆర్టీసీ బస్సులో 36 మంది ప్రయాణికులతో వెళ్లాయి. అమలాపురం డిపో నుంచి ఇప్పటి వరకు తొమ్మిది బస్సులు, రావులపాలెం నుంచి 8, రామచంద్రపురం డిపో నుంచి 4, రాజోలు డిపో నుంచి 4 వెరసి 25 బస్సుల్లో 900 మంది ప్రయాణికులు కుంభమేళాకు వెళ్లారు. ఆర్టీసీ సౌకర్యాల పట్ల భక్తులైతే హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు. అయితే ఎనిమిది రోజుల ట్రిప్‌కుగాను ట్రాఫిక్ రద్దీ కారణంగా పది రోజులు పడుతుందనేది ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.



'తూర్పు' రూ.47.52 లక్షలు

ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాకు తూర్పుగోదావరి జిల్లా ఆర్టీసీ 532 మంది భక్తులను ఇప్పటిదాకా పుణ్యస్నానాలకు తీసుకెళ్లింది. ఈ కుంభమేళా టూర్ ద్వారా జిల్లా ఆర్టీసీకి రూ.47,52,400ల ఆదాయం లభించింది. రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల నుంచి మొత్తం 16 బస్సులను ఆపరేట్ చేశారు. గోకవరం డిపో నుంచి రెండు బస్సుల్లో 68 భక్తులు, కొవ్వూరు డిపో నుంచి ఐదు బస్సుల్లో 154 మంది భక్తులు, నిడదవోలు డిపో నుంచి రెండు బస్సుల్లో 72 మంది, రాజమహేంద్రవరం డిపో నుంచి ఏడు బస్సుల్లో 238 మంది భక్తులు కుంభమేళాకు వెళ్లి వచ్చారు. మొత్తం 66,000 కిలోమీటర్లు మేర ఆర్టీసీ బస్సులను నడపడం ద్వారా జిల్లా ఆర్టీసీ రికార్డు సృష్టించింది.

కాకినాడ జిల్లా రూ.40.68 లక్షలు

ఈ ఏడాది జనవరి 31 నుంచి ఫిబ్రవరి 23 వరకు కుంభమేళాకు కాకినాడ జిల్లా నుంచి 14 బస్సులు భక్తులను సురక్షితంగా తీసుకెళ్లి తీసుకువచ్చాయి. ఇందుకుగాను ఆర్టీసీకి రూ.40.68 లక్షలు ఆదాయం వచ్చింది. కాకినాడ ఆర్టీసీ డిపో నుంచి కుంభమేళాకు బయలుదేరిన ప్రతీ బస్సు మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి ప్రయాగ్‌రాజ్, వారణాసి, అయోధ్య, పూరి, కోణార్క్ వంటి ప్రాంతాలన్నీ భక్తులకు దర్శనార్థం తీసుకెళ్లి ఎనిమిదవ రోజు ఉదయం కాకినాడ డిపోకి చేర్చేవారు. భక్తులకు ఆర్టీసీ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి వేళలో టిఫిన్ ఇచ్చేవారు. కాగా కొవ్వూరు ఆర్టీసి డిపో నుంచి కుంభమేళాకు 5 బస్సుల్లో 162 మంది యాత్రికులను పంపించినట్టు డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్ తెలిపారు. కుంభమేళా ప్రత్యేక సర్వీసుల ద్వారా కొవ్వూరు డిపోకు టిక్కెట్ల ద్వారా రూ. 19.75 లక్షల ఆదాయం రాగా, రూ. 10.20 లక్షలు ఖర్చులు అయ్యిందన్నారు. ప్రత్యేక సర్వీసుల ద్వారా కుంభమేళాకు వెళ్లిన భక్తులకు ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటుచేశామన్నారు. ప్రతి బస్సులో మెడికల్ కిట్టుతో మెకానిక్, వంటమాస్టర్, భక్తుల సౌకర్యార్థం గైడ్‌ను ఏర్పాటుచేశామన్నారు. బస్సులో ఇద్దరు డ్రైవర్లు, డ్రైవర్ల నంబర్లతో కూడిన ఐడీ కార్డులను ప్రతి యాత్రికుడికి అందించి సురక్షితంగా యాత్రికులను తిరిగి ఇంటికి చేర్చడం జరిగిందన్నారు. ప్రయోగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళాకు నిడదవోలు ఆర్టీసీ డిపో నుంచి రెండు సర్వీసులు నడిపినట్టు కాకినాడ డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు.

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : బస్సుల్లోనే వంట మనుషులు, వంట సామగ్రి.. దర్శనీయ క్షేత్రం తెరిచే సమయానికి బస్సు చేరుకునేలా ప్రణాళిక.. దర్శనం చేసుకుని వచ్చేసరికి అల్పాహారం రెడీ... మళ్లీ ప్రయాణం.. మధ్యలో భోజనం.. ఇలా పక్కా ప్లాన్‌తో కుంభమేళా టూర్‌ను ఆర్టీసీ అధికారులు సక్సెస్ చేశారు. గతంలో అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ఠకు బస్సులను నడిపిన అనుభవం ప్రయాగ్‌రాజ్ కుంభమేళా టూర్‌కు ఎంతో ఉపయోగపడింది.

● ముందుగా కొవ్వూరు డిపో నుంచి..

ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు ముందుకు కొవ్వూరు డిపో నుంచి బస్సులు నడిపారు. ఆ తర్వాత రాజమహేంద్రవరం డిపోతో పాటు గోకవరం, నిడదవోలు, రావులపాలెం, కాకినాడ, మచిలీపట్నం, అనంతపురం, కర్నూలు నుంచి బస్సులు పెట్టారు. గతంలో కొవ్వూరు డిపో నుంచి ఒక రోజు యాత్రకు వచ్చిన భక్తుల ఫోన్ నెంబర్లతో ఒక వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేయడం ఆర్టీసీ అధికారులకు ఎంతో ఉపయోగపడింది. కొవ్వూరు డీఎం కుమార్, ఏడీసీ సూర్యచంద్రరావు ఈ గ్రూప్ కియేట్ చేశారు. అలాగే, రాజమహేంద్రవరం డిపోకు చెందిన సీనియర్ డ్రైవర్ రామకృష్ణ గత కుంభమేళాకు వెళ్లి వచ్చిన అనుభవం ఈ టూర్‌కు బాగా కలసివచ్చింది. ముందుగా కొవ్వూరు డిపో నుంచి ఫిబ్రవరి 1న రెండు బస్సులు కుంభమేళాకు వెళ్లాయి. ఒక బస్సు ఫుల్ కావడంతో, ఆ వెంటనే పుష్‌బ్యాక్ స్లీపర్ బస్సు (నాన్ ఏసీ, స్టార్‌లైనర్) పెట్టారు. ఇలా కుంభమేళా టూర్‌కు మంచి రెస్పాన్స్ రావడంతో అన్ని డిపోల నుంచి బస్సులు వెళ్లాయి.

ఇష్టమైన మెనూ..

కుంభమేళా యాత్రలో భోజనాలు, దర్శనం, ఇతర సౌకర్యాలకు ఇబ్బంది లేకుండా రెండు, మూడు బస్సులు ఒకేసారి బయలుదేరేలా ప్లాన్ చేసుకున్నారు. వంట కోసం వంటమాస్టర్‌తోపాటు, ఒక మగ, ఇద్దరు మహిళలు (సహాయకులు)ను తీసుకెళ్లారు. వంట సామగ్రి అంతా వాళ్లే తెచ్చుకుంటారు. బస్సు ఆగిన టైంలో వంట చేసి పెడతారు. పూర్తి శాకాహార భోజనం అందించారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి టిఫిన్ అందించారు. దీనికి ఒకరికి రోజుకు రూ.250 చొప్పున చెల్లించారు. పుష్‌బ్యాక్ సీట్లు కావడంతో బస్సు ప్రయాణంలో యాత్రికులకు ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు. బస్సులోనే రెస్ట్ తీసుకునేవారు. ప్రయాగ్‌రాజ్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో బస్సులను ఆపేసేవారు. అక్కడి నుంచి భక్తులు ఆటోలో వెళ్లి దర్శనం చేసుకుని తిరిగి పార్కింగ్ ప్రదేశానికి వచ్చేవారు. ఈ క్రమంలో సంబంధిత ఆర్టీసీ డిపో అధికారులు, టూర్ కో ఆర్డినేటర్లు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయడంతో ఆర్టీసీ కుంభమేళా యాత్ర సక్సెస్‌ఫుల్‌గా సాగిందని చెప్పారు.

మహాకుంభ మేళాతో జన్మధన్యం



మహాకుంభ మేళా యాత్రకు వెళ్లడంతో జన్మ ధన్యమైంది. యాత్రలో భాగంగా 14 పుణ్య క్షేత్రాలను దర్శించాం. పుణ్యనదీ స్నానాలు ఆచరించడం జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేని మధురానుభూతి. 124 ఏళ్లకు ఒకసారి వచ్చే మహాకుంభమేళాలో పాల్గొనడం దేవుడిచ్చిన వరం. ఆర్టీసీ సంస్థ కల్పించిన సదుపాయాలు అద్భుతం. ఎక్కడా ఎవరికీ ఏ లోటు రానీయలేదు. ఆర్టీసీ సంస్థ భక్తులకు కల్పించిన అద్భుత అవకాశమిది.

కాండ్రేగుల శ్రీనివాసరావు, లక్ష్మీసంధ్య దంపతులు
అంబాజీపేట



మహాకుంభమేళా యాత్రకు వెళ్లిన కోనసీమ బృందం

గ్రేట్ అచీవ్‌మెంట్ ఇది



రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాకు ఆర్టీసీ బస్సులను సక్సెస్‌ఫుల్‌గా నడపడం మాకు పెద్ద అచీవ్‌మెంట్. బస్సు డ్రైవర్లు, కో ఆర్డినేటర్లతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటూ సక్సెస్‌ఫుల్‌గా టూర్ పూర్తి చేశాం. అక్కడ కూడా తెలుగువాళ్లు ఉన్నారు. వాళ్లతో కాంటాక్టు పెంచుకుంటూ ఎప్పటికప్పుడు అక్కడి సమాచారం తెలుసుకుంటూ దానికి అనుగుణంగా చర్యలు తీసుకున్నాం. డ్రైవర్లు, సహకారం అందించిన అధికారులు, ఉద్యోగులను అభినందించే కార్యక్రమం చేపడతాం అని ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిలా అశోక వెల్లడించారు. **- షర్మిలా అశోక, ఆర్టీసీ జిల్లా అధికారిణి**

బైక్‌పై ప్రయాగ్‌రాజ్‌కు

రౌతులపూడి నుంచి 1200 కి.మీ..



రౌతులపూడి, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): అందరూ రైళ్లలో, బస్సుల్లో కుంభమేళాకు వెళితే, వీరు బైక్‌ల మీద వెళ్లి వచ్చారు. చాలామంది బస్సులు, కార్లు, రైళ్ల ప్రయాణం చేస్తూ కుంభమేళాకు వెళుతుండగా కాకినాడ జిల్లా రౌతులపూడి గ్రామానికి చెందిన యదగిరి శ్రీను, యర్రాశ్రీను, గోడి తాతాజీ, దివిలి సత్తిబాబులు రెండు బైక్ మీద ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లారు. మూడు రోజులు ప్రయాణం చేసి రౌతులపూడి నుంచి ప్రయోగ్‌రాజ్‌కు 1200 కిలోమీటర్లు బైక్‌లపై ప్రయాణం చేశారు.

ప్రణాళికాబద్ధంగా నడిపాం..



కుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం కాకినాడ జిల్లా నుంచి ప్రణాళికబద్ధంగా బస్సులు సిద్ధం చేశాం. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా వారికి ఆహార పదార్థాలు కూడా అందించాం. క్షేమంగా వెళ్లి క్షేమంగా తీసుకురావడంలో డ్రైవర్లు చక్కగా వ్యవహరించారు. దీని ద్వారా ఆర్టీసీకి కూడా రూ.40.68 లక్షలు ఆదాయం సమకూరింది.

– శ్రీనివాసరావు, ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి, కాకినాడ



మధ్యప్రదేశ్‌పై ఆంధ్రా విజయం



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

- బిహార్‌పై ఒడిస్సా
- ఢిల్లీపై హరియాణా
- తెలంగాణపై ఉత్తరాఖండ్
- కర్ణాటకపై ఒడిస్సా
- సిమ్లాపై కాన్పూర్
- ఉత్తరప్రదేశ్‌పై గుజరాత్ విజయం
- ముంబై-బెంగళూరు మ్యాచ్ డ్రా
- ఉత్సాహంగా కినాడలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్

కలెక్టరేట్/కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ పట్టణం జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లు మొత్తం 8మ్యాచ్‌లు జరిగాయి. రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ వైడీ రామారావు, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ సీఈవో గోవిందరాజు, ట్రస్ట్ ఆసుపత్రి ఛైర్మన్ రామకృష్ణ, డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు పాల్గొన్నారు. ఒడిస్సా, బీహార్ సెక్రటేరియట్ మహిళ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిస్సా సెక్రటేరియట్ జట్టు 7-0 తేడాతో విజయం సాధించింది. హరియాణా, ఢిల్లీ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హరియాణా సెక్రటేరియట్ 4-0 తేడాతో విజయం సాధించింది. తెలంగాణ సెక్రటేరియట్, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ మహిళల జట్టుల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ 20-0 తేడాతో విజయం సాధించింది. ఒడిస్సా, కర్ణాటక సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిస్సా జట్టు 10-2 తే డాతో విజయం సాధిం చింది. ఆర్ఎస్బీ కాన్పూర్, ఆర్ఎస్బీ సిమ్లా జట్ల మధ్య జరి గిన మ్యాచ్‌లో ఆర్ ఎస్బీ కాన్పూర్ 2-0 తేడాతో గెలిచింది. ఆర్ ఎస్బీ ముంబై, ఆర్ఎస్బీ బెంగ ళూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఇరు జట్లు 1-1 గోల్స్ నమోదు చేయడంతో మ్యాచ్ డ్రా అయింది. గుజరాత్, ఉత్తరప్రదేశ్ సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ సెక్రటేరి యట్ 5-0 తేడాతో విజయం సాధించింది.



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌లో భాగంగా జిల్లా క్రీడామైదానంలో శనివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాల్లో హరిప్రియ క్లాసికల్‌డాన్స్, దేవిస్తుతి, రాధాకృష్ణ కళాక్షేత్రం వారి నారాయణ క్లాసికల్, వినాయక కౌముది, తమిళ్,



సాంస్కృతిక కార్యక్రమాల్లో కళాకారుల ప్రదర్శనలు

ఒడిస్సా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కళాకారులు పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. జై జవాన్ జై కిసాన్, వం దేమాతరం వంటి పాటలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. వివి ధ రాష్ట్రాల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు చేశారు. కోకనాడ పోస్టల్ క్లబ్ ఫౌండర్ రవిచంద్రప్రసాద్ నృత్య కళాకారిణి హరిప్రియకు రూ.5 వేలు చెక్కు అందజేశారు.





పోటీలో తలపడుతున్న క్రీడాకారిణులు



బాల్ కోసం పోటీ పడుతున్న క్రీడాకారిణులు



కళాకారిణి హరిప్రియకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న రవిచంద్రప్రసాద్

పేద క్రీడాకారులకు హాస్టల్స్ ఏర్పాటు చేయాలి



ప్రతిభ ఉండి వెనుకబడిపోతున్న పేద క్రీడాకారుల కోసం హాస్టల్ సౌకర్యం ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇస్తే ఎంతో నైపుణ్యం కలిగిన క్రీడాకారులు తయారవుతారు. అలాగే క్రీడాకారుల కోసం మంచి శిక్షణ పొందిన కోచ్‌లను కూడా నియమించాలి. 2శాతం ఉన్న స్పోర్ట్స్ కోటాను 3శాతానికి పెంచి ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి నిర్ణయం తీసుకున్నారు. దీని వల్ల ఎంతో మంది క్రీడాకారులకు మంచి భవిష్యత్ ఉంటుంది. స్మార్ట్‌సిటీ నిధులు రూ.18 కోట్లతో నిర్మించిన మల్టీపర్పస్ కన్వర్టబుల్ స్టేడియం వినియోగంలోకి తీసుకువస్తే క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే త్వరలో జరగనున్న నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు కూడా కాకినాడ వేదికగా నిలిచే అవకాశాలున్నాయి.

-చుండ్రు గోవిందరాజులు, సీఈవో, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్

ప్రతీ మ్యాచ్‌ను నిశితంగా పరిశీలిస్తాం



మ్యాచ్ మొదలైన దగ్గర నుంచి చివరి వరకు క్రీడాకారులు వేసే గోల్స్‌ను చాలా నిశితంగా పరిశీలిస్తూనే ఉంటాం. మా నుంచి ఎటువంటి చిన్న పొరపాటు జరిగిన క్రీడాకారులు ఆయా జట్టు ఎంతో నష్టపోతాయి. అందుకనే ప్రతీ గోల్‌ను క్లీన్‌గా అబ్జర్వ్ చేస్తాం. టెక్నికల్ అఫీషియల్‌గా మ్యాచ్ మధ్యలో జరిగే గొడవల విషయంలో కూడా చాలా సమన్వయంతో క్రీడాకారులను కంట్రోల్ చేస్తూ మ్యాచ్‌ను ముందుకు తీసుకెళ్లాల్సి వస్తుంది. కొన్ని రాష్ట్రాల్లో మ్యాచ్ మధ్యలో లోకల్ పర్సన్స్ వచ్చి గొడవలు సృష్టిస్తుంటారు. అలాంటి సందర్భాల్లో పరిస్థితులు క్లిష్టంగా మారుతుంటాయి. అటువంటి సందర్భాల్లో పరిస్థితులు బట్టి ఫస్ట్ వార్నింగ్‌కు గ్రీన్‌కార్డు, క్రీడాకారులను కావాలని ఇబ్బంది పెడితే ఎల్లో కార్డు, క్రీడాకారుల మధ్య గొడవలు జరిగితే రెడ్‌కార్డు ఉపయోగించి క్రీడాకారులను మ్యాచ్ నుంచి బయటకు పంపిస్తాం.

-ఎం.అశోక్‌రెడ్డి, సీనియర్ టెక్నికల్ అఫీషియల్, ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ హాకీ

అంతరంగం పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో మంత్రి దుర్గేష్, మాజీ మంత్రి డొక్కా, మాజీ ఎంపీ ఉండవల్లి, రచయిత శ్రీపాద

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విషయ పరిజ్ఞానంతో సాహిత్యపరంగా సాగే రచనలు ఉత్తమ సమాజ నిర్మాణానికి ప్రేరణగా నిలుస్తాయని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రచయిత శ్రీపాద శ్రీనివాస్ స్వీయ అనుభవాలతో రూపొందించిన అంతరంగం సంకలనాన్ని శనివారం స్థానిక ప్రకాశం నగర్ బుక్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన సభకు దుర్గేష్‌తోపాటు మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ శ్రీపాద శ్రీనివాస్ హైదరాబాదులో సీఎల్పీ ఉద్యోగిగా, నాడు తనకు శాసన మండలిలో ఎంతో విషయ పరిజ్ఞానంతో విషయాలు అందించేవారని గుర్తు చేశారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ శ్రీపాద రచనల్లో సహజత్వం ఉట్టి పడుతుందన్నారు. ఈ సందర్భంగా శ్రీపాదను సత్కరించారు. కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, రౌతు సూర్యప్రకాశరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, సీసీసీ ఛానల్ ఎండీ పంతం కొండలరావు, వక్కలంక నాగేంద్ర, అత్తిలి జగన్నాథం, చింతపెంట ప్రభాకర్, రామినీడి మురళి, షేక్ అసదుల్లా అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉమాదేవికి రెండున్నర కిలోల వెండి చీర



వెండి చీరలో ఉమాదేవి అమ్మవారు

ఆలమూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారంలోని ఉమా మూలేశ్వరస్వామి ఆలయంలోని ఉమాదేవి అమ్మవారికి వెండి చీరను భక్తులు బహూకరించారు. గ్రామానికి చెందిన పేరూరి మహేందర్‌నాథ్ దంపతులు రూ.3లక్షల విలువగల రెండున్నర కిలలో వెండితో తయారు చేయించిన తయారు చేయించిన చీరను శనివారం ప్రత్యేక పూజలు చేయించి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంఎస్ఆర్.కృష్ణ చేతుల మీదుగా మహేంద్రనాథ్ దంపతులు అందించి అమ్మవారికి అలంకరించారు. వెండి చీరను బహూకరించిన మహేంద్రనాథ్ దంపతులను పలువురు అభినందించారు.

భక్తవత్సల గోవిందా!

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.51.61 లక్షలు



ఆత్రేయపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాఘ శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్ర పుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాల భోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ లైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. పలు సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.51.61 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఇదిలా ఉండగా స్వామిని బుల్లితెర నటీ వర్షి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వర్షితో భక్తులు సెల్ఫీలు తీసుకున్నారు.

హెచ్ఎం వేధింపులతో ఉపాధ్యాయురాలి ఆత్మహత్యాయత్నం


అమలాపురంలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయురాలు లావణ్య

- అమలాపురం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయురాలు
- తోటి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నిరసన
- హెచ్ఎం పాఠశాలలో ఉంటే మేం...పాఠాలు చెప్పలేం
- హెచ్ఎంను వెంటనే బదిలీ చేయాలని ఉపాధ్యాయుల పట్టు
- విచారణ అనంతరం చర్యలు ఉంటాయని డీఈవో ప్రకటన

పి.గన్నవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మన హెచ్ఎం వేధింపులు నేను భరించలేను.. నేను వెళ్లిపోతున్నాను అంటూ ఉదయం తన నివాసం నుంచి వీడియో కాల్‌లో తోటి ఉపాధ్యాయులకు చెబుతూ ఆత్మహత్యకు పాల్పడిన ఓ ఉపాధ్యాయురాలి వీడియో కాల్‌లో ఉన్న తోటి ఉపాధ్యాయులు, ఆమె భర్త అప్రమత్తం కావడంతో ప్రాణాలతో బయటపడి అమలాపురంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. దీంతో ఆ ఉపాధ్యాయురాలు పనిచేస్తున్న ముంగండ హైస్కూల్లో తోటి ఉపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాఠశాల ఆవరణలో బైఠాయించి హెచ్ఎంకు వ్యతిరేకంగా నిరసనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి.... అమలాపురానికు చెందిన డీఎస్‌డీ లావణ్య 2023జూన్‌లో ముంగండ హైస్కూల్లో బయోలాజికల్ ఉపాధ్యాయురాలిగా వచ్చారు. ఈక్రమంలో గత కొంతకాలంగా తరుచూ హెచ్ఎం జి.కనకదుర్గ వేధింపులకు గురిచేస్తుందని తీవ్ర వత్తిడికి గురవుతున్నానని తోటి ఉపాధ్యాయులతో చెప్పుకుంటూ వచ్చింది. ఈనేపథ్యంలో తోటి ఉపాధ్యాయుల గ్రూప్‌కు వీడియోకాల్ చేసి నేను వెళ్లిపోతున్నానని చెప్పి ఆత్మహత్యకు పాల్పడింది. వీడియోలో గమనించిన ఉపాధ్యాయులు అమలాపురంలోనే ఉన్న మరో ఉపాధ్యాయుడిని, భర్త మున్సిపాలిటీలో పనిచేస్తున్న ప్రసాద్‌ను అప్రమత్తం చెయ్యడంతో ఉరి వేసు కోవడానికి ప్రయత్నిస్తున్న లావణ్యను కిందికి దించారు. అస్వస్థతకు లోనడండంతో చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయసంఘాల నేతలు ముంగండ చేరుకుని నిరసన ప్రారంభించారు. హెచ్ఎంను వెంటనే బదిలీ చేయాలని లేకపోతే ఉపాధ్యాయులందరినీ ఈ స్కూలు నుంచి బయటకు పంపించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకుని డీఈవో సలీంబాషా ఆదేశాలమేరకు అక్కడకు చేరుకున్న డీసీఈబీ కార్యదర్శి బి.హనుమంతరావు, ఎంఈవోలు కె.హెలీనా, సిహెచ్ వీరభద్రానందం, మోకా ప్రకాష్, కె.వెంకటేశ్వ రరావులు ఉపాధ్యాయులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. పాఠశాల ఉపాధ్యాయుల కార్యదర్శి మేథ్స్ టీచర్ కోట సత్యనారాయణ మాట్లాడుతూ హెచ్ఎం కనకదుర్గ 2023లో ముంగండ పాఠశాలకు వచ్చారని అప్పటి నుంచి వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆత్మహత్యకు పాల్పడిని లావణ్య గతంలో రెండుసార్లు హెచ్ఎం వేధింపులకు తీవ్ర వత్తిడికి గురై గర్భస్రావం కూడా జరిగినట్లు చెప్పారని తెలిపారు. ఆత్మహత్య విషయం హెచ్ఎం దృష్టికి తీసుకువెళితే ఇదంతా డ్రామా అనిచెప్పి తోసిపుచ్చారని మండిపడ్డారు. ఆమెను బయటకు పంపి శాఖాపరమైన చర్యలు తీసుకునే వరకు విద్యార్థులకు పాఠాలు చెప్ప బోమని ఉపాధ్యాయులు తేల్చి చెప్పారు. ఇదే విషయాన్ని హనుమంతరావు డీఈవో దృష్టికి తీసుకువెళ్లగా హెచ్ఎంను పది రోజులు సెలవుపై వెళ్లాలని అప్పటివరకు ఇన్‌చార్జ్ హెచ్ఎంను నియమించాలని విచారణ అనంతరం చర్యలు ఉంటాయని ఆదేశాలు జారీ చేశారు. హెచ్ఎం సెలవుపై వెళ్లడంతో ఉపాధ్యాయులు నిరసన విరమించి క్లాస్‌రూమ్‌లకు వెళ్లారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్టీయూ, యూటీఎఫ్ నాయకులు పోతంశెట్టి దొరబాబు, నాగిరెడ్డి శివప్రసాద్, సరిదే సత్యపళ్లంరాజు, ఎంటీయూ సుబ్బారావు, పింకే వెంకటేశ్వరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ముంగండ హైస్కూల్లో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయసంఘాల నాయకులు


ముంగండ ప్రధానోపాధ్యాయురాలు కనకదుర్గ

నిబంధనలు పాటించడం వేధింపులా

- హెచ్ఎం జి.కనకదుర్గ

ప్రభుత్వ నిబంధనలు అనుసరించి నడుచుకోమనడం వేధింపుల్లా ఉన్నాయని హెచ్ఎం జి.కనకదుర్గ అన్నారు. ముంగండ పాఠశాలకు వచ్చే సరికి విద్యార్థులు బాగా వెనుకబడి ఉన్నారని వారిని గాడిలో పెట్టేందుకే ప్రయత్నం చేస్తున్నానని ఆ తరహా పనులు ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. వెనుకడిన విద్యార్థులకు అక్షరాలు నేర్పమంటే తప్పా అని ఆమె ప్రశ్నించారు. ఏ పాఠశాలలోను ఈరకమైన చర్యలు తీసుకోవడంలేదని మీరు ఎందుకు చేస్తున్నారని ఉపాధ్యాయులు నన్ను ప్రశ్నించారని ఆమె వాపోయారు. ఉపాధ్యాయురాలు ఆత్మహత్యకు నాకు సంబంధంలేదని ఏకారణాలు వలన చేసుకున్నారో తెలియదనిఆమె స్పష్టం చేశారు.

శుభకార్యానికి వెళుతూ ...
రోడ్డు ప్రమాదం

- వేగాయమ్మపేట వద్ద విరిగిన మినీ వ్యాను యాక్సిల్.. ఊడిన చక్రం
- వ్యానులో వెళుతున్న 39 మందికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం


కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న జాలెం వీరవేణి.ఏరియా ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న క్షతగాత్రులు, ప్రమాదానికి గురైన వ్యాను

ద్రాక్షారామ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వేగాయమ్మ పేట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శుభకార్యానికి వెళుతున్న 39 మంది గాయపడ్డారు. అందులో ఒక మహిళపరిస్థితి విషమంగా ఉంది. మండలంలో తోటపేట శివారు గాంధీనగర్‌కు చెందిన 40మంది మసకపల్లిలో జరిగే శుభకార్యానికి వ్యానులో వెళుతుండగా ప్రయాణిస్తున్న వ్యాను వెనుక యాక్సిల్ విరగడంతో కుడివైపు చక్రం ఊడిపడి ప్రయాణిస్తున్న వారు గాయపడ్డారు. పోలీసులు, క్షతగాత్రులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం ఉదయం11 గంటల ప్రాంతంలో గాంధీనగర్‌కు చెందిన 33 మంది వరకు మహిళలు, ముగ్గురు పురుషులు, ఇరువురు బాలురు, ఒక బాలిక మసకపల్లిలో జరిగే శుభకార్యానికి అశోక్ లైలాండ్ మినీ వ్యానులో బయలు దేరారు. బయలుదేరిన కొద్ది నిమిషాల్లో గాంధీనగర్ దాటి వేగాయమ్మపేట చర్చి ప్రాంతానికి చేరేసరికి మినీ వ్యాను వెనుక కుడివైపు చక్రం యాక్సిల్ విరిగిపోయింది. దీంతో చక్రం ఊడిపడింది. వ్యాను అదుపుతప్పి వ్యానులో ప్రయాణిస్తున్న వారు ఒకరిపై ఒకరు పడ్డారు. వ్యాను కొంతదూరంవరకు వెళ్లడంతో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్సుల్లో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటన తెలుసుకున్న మంత్రి సుభాష్ కూటమి నాయకులు, ఏరియా ఆసుపత్రి వైద్యులను అప్రమత్తం చేశారు. క్షతగాత్రులు రెండు అంబులెన్సులు, మరో రెండు వాహనాల్లో ఏరియా ఆసుపత్రికి చేరుకున్నారు. అప్పటికే ఏరియా ఆసుపత్రికి చేరుకున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, గొల్లపల్లి కృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యంలు ఆసుపత్రి సిబ్బంది క్షతగాత్రులను వాహనాల నుంచి ఆసుపత్రిలో చేర్చారు. సూపరింటెండెంట్ డా.ప్రవీణ్, వైద్యులు, సిబ్బంది 39 మంది క్షతగాత్రులకు బెడ్‌లు కేటాయించి ప్రథమ చికిత్స అందించారు. క్షతగాత్రుల్లో జాలెం వీరవేణికి తలకు తీవ్రగాయాలు కావడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అల్లంపల్లి భారతి చేయి విరగడంతో కాకినాడలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను ఆర్డీవో అఖిల, డీఎస్పీ రఘువీర్‌లు పరామర్శించారు.

బావిలో పడి వ్యవసాయ కూలీ మృతి

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) ప్రమాదవశాత్తూ వ్యవసాయ పొలంలోని బావిలో పడి వ్యవసాయ కూలి మృతి చెంది న సంఘటన శనివారం సాయంత్రం కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి గ్రామంలో జరిగింది. పోలీసులు అం దించిన సమాచారం మేరకు.. పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన అంకం సుబ్రహ్మణ్యం (48) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో శనివారం బావిలో నీరు తోడుతుండగా ప్ర మాదవశాత్తూ బావిలో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సుబ్రహ్మణ్యం భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

తునిలో చిన్నారిపై అత్యాచారయత్నం

తునిరూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తుని పట్టణంలో దారుణం చోటుచేసుకుంది. పట్టణలో ఓ కుటుంబం కూలి పనికి వెళ్లగా అదే కుటుంబానికి చెందిన ఐదేళ్ల చిన్నారిని తుని పట్నానికి చెందిన ఓ యువకుడు కేక్ కొనిస్తానన్నాడు. ఐదేళ్ల చిన్నారిని నమ్మబలికి అత్యాచారానికి యత్నించినట్లు బాలిక తల్లి దండ్రులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ గీతా రామకృష్ణ తెలిపారు. ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు పోక్స్ యాక్ట్‌తోపాటుగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసునమోదు చేసినట్లు సీఐ వివరించారు.

భక్తుల సౌకర్యాలపై దృష్టి పెట్టాలి

- అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు

అన్నవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ఆదాయ మార్గాల అన్వేషణ కంటే భక్తులకు సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని ఈవో వీర్ల సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం ప్రకాష్‌సదన్ పాలకమండలి సమావేశపుహాలులో దేవస్థానం ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ప్రధానంగా ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐవీఆర్ఎస్ సర్వేలో అన్నవరం దేవస్థానం చివరిస్థానంలో ఉండడంతో దీనిని మెరుగుపరిచేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ అన్నవరం దేవస్థానం అధికారులందరితో సమావేశమవుతున్నందున ప్రతి విభాగ సిబ్బంది పూర్తిసమాచారంతో ఉండాలని సూచించారు. ప్రధానంగా రత్నగిరిపై షాపు లీజుదారులు భక్తులపట్ల అమర్యాదగా, చిరాకుగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు అధికంగా ఉన్నాయని లీజుదారులు హద్దుమీరితే చర్యలు తీసుకోవాలన్నారు. వ్రతపురోహితులు సైతం భక్తులపట్ల వ్యవహరించే తీరుపై వారి సందేహాలను నివృత్తిచేయడంలో సరిగా పనిచేయడంలేదని పనితీరు మార్చుకునేవిధంగా వ్రతవిభాగ అధికారులు దృష్టిపెట్టాలని అన్నారు. అదేవిధంగా సౌకర్యాల కల్పన విషయంలో పశ్చిమరాజగోపురం ఎదురుగా దాత సహకారంతో నిర్మించ తలపెట్టిన షెడ్డును ఈవేసవి సమీపించేలోపు పూర్తిచేయించాలని సిబ్బంది ఈవోకు సూచించారు. మరోపక్క మరుగుదొడ్లు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. సత్రంగదుల నిర్వహణపై ఎప్పటికప్పుడు, దుప్ప ట్లు మార్చడం, నీటి కష్టాలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, ఏఈ వోలు శ్రీనివాస్, కొండలరావు, ఇంజనీరింగ్ అధికారులు రామకృష్ణ, నూకరత్నం, సూపరిం టెండెంట్‌లు బలువు సత్యశ్రీనివాస్, అనకాపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.


పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం ఒకదాత రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విశాఖపట్టణానికి చెందిన గేదెల వరలక్ష్మి ఈ మొత్తాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు.

'లోవ' క్షేత్రానికి అంతర్జాతీయ గుర్తింపు


తలుపులమ్మ లోవ ప్రాంగణం

తునిరూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి అంతర్జాతీయ గుర్తింపు లభించినట్లు ఆలయ ఈవో పి.విశ్వనాథ్‌రాజు తెలిపారు. తిరుపతిలో 3 రోజులపాటు జరిగిన ఇంటర్నేషనల్ టెంపుల్ సమ్మిట్‌లో రాష్ట్రంలో పలు ఆలయాలతో పాటుగా తలుపులమ్మ ఆలయంపై వివరించి ప్రదర్శించామన్నారు. 150 దేశాల ప్రతినిధులు లోవ ఆలయాన్ని సందర్శించారని ఈవో వివరించారు. రాష్ట్రంలో ప్రప్రథమంగా ఆలయంలో ఎక్స్‌లేటర్ ఏర్పాటు, ఆలయ పునః నిర్మాణ పనులపై సమ్మిట్‌లో వివరించామని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ కోరుతూ సైకిల్ యాత్ర

- 29,650 కిలోమీటర్లు యాత్ర పూర్తిచేసిన ముత్తుసెల్వన్


సైకిల్‌యాత్ర చేస్తున్న ముత్తుసెల్వన్

మామిడికుదురు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోరుతూ తమిళనాడులోని కొయంబత్తూరుకు చెందిన ముత్తుసెల్వన్ ఆసియా దేశాల్లో సైకిల్ యాత్ర చేపట్టాడు. ఎనిమిది ఆసియా దేశాల్లో యాత్ర చేసే విధంగా 2021 డిసెంబరు 21న యాత్రకు శ్రీకారం చుట్టి ఇప్పటివరకు మూడు దేశాల్లో 29,650 కిలోమీటర్లను 1150 రోజుల్లో పూర్తిచేశారు. బంగ్లాదేశ్, నేపాల్‌తోపాటు ఇండియాలో సైకిల్‌యాత్ర పూర్తయిందని, ఇండియాలో పూర్తవుతుందన్నారు. కరోనా సమయంలో ఆక్సిజన్ లేక అనేకమంది మరణాలు సంభవించడం చూసి చెట్లు నాటే విధంగా ఈ యాత్రను నిర్వహిస్తున్నానని, ప్రతీ గ్రామంలోను చెట్లు నాటే విధంగా స్థానిక అధికారులతో మాట్లాడుతున్నట్టు తెలిపారు. 44వేల కిలోమీటర్లతో తన యాత్ర పూర్తవుతుందని, 2027 డిసెంబరు 21 నాటికి యాత్రను పూర్తి చేస్తానని తెలిపారు. సెల్వన్ శనివారం మామిడికుదురు చేరుకుని నగరం ఎస్ఐ చైతన్యకుమార్, తహశీల్దార్ సుబ్రహ్మణ్యాచార్యులను కలుసుకుని యాత్ర విశేషాలను తెలిపాడు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

శనివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. అల్లూరిజిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం సమీపంలో జరిగిన ప్రమాదంలో ఒడిశావాసి మృతిచెందాడు. అలాగే కాకినాడజిల్లా సామర్లకోట మండ లం మేడపాడు వద్ద బైక్ అదుపుతప్పి ఒక వ్యక్తి మృతి చెందాడు. తొండంగి మండలం అన్నయ్యపేటవద్ద బీచ్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు.

టాటా మ్యాజిక్ వాహనం ఢీకొని ఒడిశా వాసి మృతి


ప్రమాదంలో మృతి చెందిన బజారి

ఎటపాక, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న స్కూటీని టాటా మ్యాజిక్ వాహనం ఢీకొన్న ఘటనలో ఒడిశావాసి మృతి చెందాడు. ఈసంఘటన శనివారం అల్లూరిజిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం సమీపంలో విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రం మల్కాజ్‌గిరి జిల్లా బీనాయక్‌పూర్ గ్రామంనకు చెందిన పండా బజారి (38)తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలో పేయింటింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇటీవల స్వగ్రామంకు వెళ్లిన అతను ఈనేపథ్యంలో తిరిగి స్కూటీపై బీనాయక్‌పూర్ నుంచి భద్రాచలం వస్తున్నాడు. భద్రాచలంవైపు నుంచి ఏడుగురాళ్ల పల్లి వెళ్తున్న టాటా మ్యాజిక్ లక్ష్మీపురం గ్రామ శివారులోని మలుపువద్ద ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బజారి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడ దుర్మరణం చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్‌సైకిల్ నుంచి పడి వ్యక్తి మృతి

సామర్లకోట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా సామర్లకోట మండలం జీ.మేడపాడు కెనాల్ రోడ్లో వేట్లపాలెం- జీ.మేడ పాడు గ్రామాల మధ్య వేగంగా వెళుతున్న మోటార్‌సైకిల్ నుంచి అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయాలు అయ్యి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. సామర్లకోట రాజీవ్ గృహకల్ప వద్ద నివాసం ఉంటున్న పెద్దాపురం నారాయణ కళాశాలలో పీఆర్వోగా పనిచేస్తున్న నగరం సత్తిబాబు(42) సామర్లకోట నుంచి మోటార్ సైకిల్‌పై తన అత్తగారిల్లు అయిన పెదబ్రహ్మదేవం వెళుతుండగా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం సమీపాన అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు అందించిన సమాచారంతో సామర్లకోట పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని అతని వద్ద లభించిన చిరునామా మేరకు సామర్లకోటలో ఉన్న కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌లు ఢీకొని యువకుడి మృతి


రోడ్డు ప్రమాదంలో మరణించిన యువకుడు

తొండంగి, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): తొండంగి మండలం అన్నయ్యపేటవద్ద బీచ్ రోడ్డుపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒంటిమామిడి గ్రామానికి చెందిన దారాబాల రాజు (18) దుర్మరణం చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజు తన బావను వేమవరం వద్ద దింపేందుకు హంటర్ స్పోర్ట్స్ బైక్‌పై వెళ్లి దింపి తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో ఒంటిమామిడి వైపు నుంచి అన్నయ్యపేట వైపు రాయల్‌ఎన్‌ఫీల్డ్ వాహనంపై వెళ్తున్న గరికిన రాము, రాజు స్పోర్ట్స్ బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో తుని ఏరియా ఆసు పత్రికి తరలించగా దారాబాల రాజు అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. గరికిన రాము కాలు విరిగింది. రాజు తాపీ పని చేసేవాడు. తొండంగి హెడ్ కానిస్టేబుల్ పాండురంగ కేసు నమోదు చేశారు.

చోరీ కేసుల్లో ఐదుగురి అరెస్టు

కడియం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా కడియం మండలంలోని పలు గ్రామాల్లో చోరీలకు పాల్పడిన ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కడియం పోలీసుస్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ భవ్యకిషోర్ వివరాలను వెల్లడించారు. జేగురుపాడులో జి.సత్యవతి గుడికి వెళ్లి వస్తుండగా ఇద్దరు దుండగులు ఆమె నోరు మూసి మెడలో బంగారు మంగళసూత్రాలు లాక్కుపోయినట్టు కడియం పోలీసులకు ఫిర్యాదు అందింది. అలాగే జేగురుపాడు, మురమండ, బుర్రిలంక, దుళ్ల గ్రామాల్లో చోరీలు జరిగినట్టు ఫిర్యాదులొచ్చాయి. వీటిపై సీఐ ఎ.వెంకటేశ్వరరావు, ఎస్ఐ బీఎన్ దుర్గాప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. నల్లజర్ల మండలం అవుపాడు గ్రామంలో ఉంటున్న మాధవరాయుడుపాలేనికి చెందిన కొత్తపల్లి త్రిమూర్తులు, పిఠాపురం మండలం విరవాడకు చెందిన కూరాకుల సుబ్బారావు, కపిలేశ్వరపురం మండలం వల్లూరులో ఉంటున్న మాధవరాయుడుపాలేనికి చెందిన గాదంశెట్టి వెంకన్న, మండపేట మండలం కేశవరానికి చెందిన పచ్చ రాజు, రామచంద్రపురం బాడీపేటకు చెందిన గుమ్మడి సత్యనారాయణమూర్తిలను అరెస్టు చేశారు. అలాగే మండపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి రెండు, రాజానగరం స్టేషన్‌కు సంబంధించి నాలుగు చోరీ కేసు ల్లో సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితుల నుంచి 58 గ్రాముల బంగారు ఆభరణాలు, జత వెండి పట్టీలు, ఓ బైక్, కాపర్‌వైరు, రూ.50 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మొత్తం విలువ సుమారు రూ.5,40,000 ఉంటుందని డీఎస్పీ తెలిపారు.

భార్యను కత్తితో నరికి చంపిన భర్త అరెస్టు

కొవ్వూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కత్తితో భార్యను నరికి చంపిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు మండలం వాడపల్లి బంగారమ్మపేటలో భార్య, మామపై కొబ్బరి బొండాలు కొట్టే కత్తితో దాడిచేసిన కేసులో నిందితుడిని గంధ్ర మురళీకృష్ణచౌదరిని శనివారం కొవ్వూరు పాత రైలు వంతెన (హేవలాక్ బ్రిడ్జి) వద్ద అరెస్టు చేశామన్నారు. ఈనెల 20న కుటుంబ తగాదాల నేపథ్యంలో బంగారమ్మపేటకు చెందిన గంధ్ర కృష్ణతులసి (37) ను భర్త ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం రాజుగూడెంనకు చెందిన గంధ్ర మురళీ కృష్ణచౌదరి కత్తితో నరకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అడ్డువచ్చిన కృష్ణతులసి తండ్రి అడ్డాల నాగేశ్వరరావును కత్తితో దాడి చేసి గాయపర్చాడు. దీనిపై మృతురాలి సోదరుడు అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా శనివారం గంధ్ర మురళీకృష్ణచౌదరిని కొవ్వూరు పట్టణంలోని పాత రైలు వంతెన వద్ద అరెస్టుచేసినట్లు సీఐ విశ్వం తెలిపారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చామన్నారు.

కాశీ అంతిమయాత్రలో పాల్గొన్న ప్రముఖులు


పాడె మోస్తున్న టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, శరత్

అమలాపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారులు సాత్విక్‌సాయిరాజ్ తండ్రి రంకిరెడ్డి కాశీవిశ్వనాథం అంతిమయాత్ర శనివారం జరిగింది. గాంధీబజార్‌లోని ఆయన స్వగృహంవద్ద నుంచి వందలాది మంది క్రీడాభిమానులు, పురప్రముఖులు, జాతీయ అసోసియేషన్‌ల ప్రతినిధులు, అంతర్జాతీయ క్రీడాకారులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. గాంధీబజార్ నుంచి ప్రత్యేక వాహనంలో కాశీవిశ్వనాథం భౌతికకాయాన్ని ఉంచి అంతిమ యాత్రను ప్రారంభించారు. మాచిరాజువీధి, రవణంవీధి, గుండువీధి మీదుగా మెయిన్‌రోడ్డుకు చేరుకుని అక్కడి నుంచి ఆయన కళల సాధమైన ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌కు చేరుకుంది. అక్కడ కొద్దిసేపు కాశీ భౌతికకాయాన్ని ఉంచారు. అక్కడి నుంచి మార్కెట్‌లోని హిందూ శ్మశానవాటికకు తరలించారు. మార్కెట్ ఏరియా నుంచి కాశీ భౌతికకాయాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అసోసియేషన్ ప్రతినిధి అల్లాడ శరత్ తదితరులు పాడెని మోశారు. అంతిమయాత్రలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ కార్యదర్శి పున్నయ్యచౌదరి, ఏపీపీఏ కార్యదర్శి అంకమ్మచౌదరి, టెక్నికల్ పర్సన్ ప్రసాద్, సాత్విక్‌సాయిరాజ్ జోడి అయిన చిరాగ్‌శెట్టి, అంతర్జాతీయ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్, కోచ్ టోని, ప్రముఖులు నల్లా పవన్‌కుమార్, చిక్కాల గణేష్ తదితరులు పాల్గొన్నారు. అంతిమయాత్ర అనంతరం సాత్విక్‌సాయిరాజ్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతోపాటు పలువురు ప్రముఖులు పరామర్శించారు.

జీజీహెచ్‌లో మరో జీబి సిండ్రోమ్ కేసు

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 22 (ఆంధ్రజ్యోతి):కాకినాడ జీజీహెచ్‌లో మరో గులియన్- బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసు నమోదైనట్లు ఆసుపత్రి న్యూరాలజీ ఇన్‌చార్జ్ హెచ్‌వోడి డా. ఎండీ షరీఫ్ తెలిపారు. శనివారం నమోదైన కేసుతో కలిపి మొత్తం ఐదుగురు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. తీవ్రమైన నీరసం, కాళ్ళుచేతులు తిమ్మిర్లు, కండరాల బలహీనత, జ్వరం, శ్వాసకోస సమస్యలు, వాంతులు, విరోచనాలు వంటి లక్షణాలు కనబడితే ఆందోళన చెందకుండా సంబంధిత అర్హుడైన వైద్యుడిని సంప్రదించాలన్నారు. జీజీహెచ్‌లో జీబీఎస్ కేసులకు సంబంధించి వైద్య చికిత్స, మందులు, మౌళిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఉన్నాయన్నారు.

రసవర్గాల కొనుగోలుపై ఫుడ్‌సేఫ్టీ క్వాలిటీ పరిశీలన

అన్నవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో వివిధ అవసరాలకు కొనుగోలుచేసే రసవర్గాలైన గోదుమలు, పప్పులు, పంచదార, తదితర సరుకుల నాణ్యతకు సంబంధించి శనివారం ఆహారనియంత్రణ (ఫుడ్ సేఫ్టీ) అధికారులు పర్యవేక్షణ చేశారు. ఈనెల 27న వీటి కొనుగోలుకు టెండర్లు పిలవనున్న నేపథ్యంలో ఏ రకాలు నాణ్యతగా ఉంటాయి వాటి ధరలు ఏవిధంగా ఉంటాయి అనే దానిపై సెంట్రల్‌స్టోర్స్ అధికారులు వారిని అడిగి తెలుసుకున్నారు. టీటీడీలో నెయ్యి వినియోగంపై ఆరోపణలు రావడంతో అప్పటి నుంచి అన్నవరం దేవస్థానం కొనుగోలుచేసే ముడిపదార్థాలను, అన్నిరకాల వస్తువులను వీరు తనిఖీ చేపట్టిన తరువాతనే కొనుగోలు చేస్తున్నారు. దేవస్థానంలో వీటి కొనుగోలుకు సంబంధించి ప్రతి ఆరు నెలలకు టెండర్లు పిలిచి దేవదాయకమిషనర్ ఆమోదంతో క్వాలిటీ వస్తువులు తక్కువ ధరకు టెండర్ కోడ్ చేసినవారికి సరఫరాకు అనుమతిస్తారు. ఆహార నియంత్రణ అధికారులు సుబ్బారావు, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బి పనుల్లో లోపాలు ఉంటే రికవరీ చేస్తాం

- ఆర్అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకటేశ్వరరావు

పి.గన్నవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్అండ్‌బీ పనులు నాణ్యతలో లోపాలు ఉంటే సంబంధిత కాంట్రాక్టర్ నుంచి డబ్బులు రికవరీకి ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని ఆర్అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ సీఈ జి.వెంకటేశ్వరరావు అన్నారు. పి.గన్నవరం-అమలాపురం ఏజీ రోడ్డులో సీసీ రోడ్డు నాణ్యతను ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్అండ్‌బీకి సంబంధించిన 100 పనులు పూర్తయ్యాయని వాటిని క్వాలిటీ కంట్రోల్ పరిశీలన చేస్తున్నామని చెప్పారు. ప్రతి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పరిశీలన చేసి వాటి క్వాలిటీలో లోపా ల తీవ్రతను బట్టి కొన్ని చోట్ల డబ్బులు రికవరీచేస్తే మరికొన్ని చోట్ల మరమ్మతులకు సూచనలు చేస్తామన్నారు. కొన్నిచోట్ల ఆయా ప్రాజెక్టును బట్టి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తామన్నారు. ఇటీవలే పూర్తయిన ఆర్అండ్‌బీ సీసీ రోడ్లు, బీటీ రోడ్లను క్వాలిటీ కంట్రోల్ బృందం అధికారులు పరిశీలించి స్థానిక అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సీఈతోపాటు క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ జీవీ భాస్కరరావు, ఈఈ జి.శ్రీనివాస్‌నాయక్, డి.ఈ హరిప్రసాద్, ఆర్అండ్‌బీ ఎస్ఈ జి.కాంతు, ఈఈ బి.రాము, డీఈ జి.రాజేంద్ర, జేఈ మణి కుమార్, సిబ్బంది ఉన్నారు.

కాకినాడ రైల్వే ఎంప్లాయీస్ ఇనిస్టిట్యూట్ ఎన్నికలు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రైల్వే ఎంప్లాయిస్ ఇనిస్టిట్యూట్ ఎన్నికల్లో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ ఇనిస్టిట్యూట్ సంఘ్ ప్యానల్ మజ్దూర్ యూనియన్ ప్యానల్‌పై విజయం సాధించింది. కాకినాడ టౌన్ రైల్వే కల్యాణ మండపంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. కాకినాడ,సామర్లకోట రైల్వే ఎంప్లాయీస్ ఇనిస్టిట్యూట్ సభ్యులు ఉన్నారు.

పోలీస్‌శాఖ డ్రోన్‌లతో స్పెషల్ డ్రైవ్

92 వాహనాలు సీజ్


సీజ్ చేసిన వాహనాలు

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలతో మైనర్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ పై జిల్లా పోలీస్‌శాఖ డ్రోన్‌లతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 92 ద్విచక్రవాహనాలను సీజ్ చేసింది. ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాలతో ట్రాఫిక్ అడ్డంకులు నివారించే దిశగా డ్రోన్ కెమెరా ద్వారా ట్రాఫిక్ అస్తవ్యస్తంగా లేకుండా మార్గం సుగమమయ్యేలా చర్యలు చేపట్టారు. ట్రాఫిక్-1, 2 సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు ఆధ్వర్యంలో పలు ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనదారులపై, రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలపైన డ్రోన్ కెమెరాను ఉపయోగించి వినూత్నంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 92 కేసులను నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఇందులో మైనర్ డ్రైవింగ్‌కు సంబంధించి 4 కేసులు, మోడిఫైడ్ సైలెన్సర్లకు సంబంధించి 5 కేసులు, రాంగ్ పార్కింగ్‌కు సంబంధించి 6 కేసులు, డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించి 6 కేసులు, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు సంబంధించి 31 కేసులు, ట్రిపుల్ రైడ్ సంబంధించి 40 కేసులను నమోదు చేశామన్నారు. డ్రోన్ కెమెరా ద్వారా రాంగ్ పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను టోయింగ్ వాహనాల సహాయంతో ట్రాఫిక్-2 పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. వాహనదారులు ఇక నుంచి నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని లేదంటే డ్రోన్ నిఘా నేత్రం వెంటాడుతుందని ఎస్పీ హెచ్చరించారు.

పన్నుల వసూళ్లలో ఏమాత్రం అశ్రద్ధ వద్దు

కాకినాడ కమిషనర్ భావన


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పన్నుల వసూళ్లే లక్ష్యంగా నగరపాలక అధికారులు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. మొండిబకాయిల వసూల కోసం డివిజన్లలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు కమిషనర్ భావన శారదమ్మగుడి వద్ద గల నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, సచివాలయాల సిబ్బందితో సమావేశమయ్యారు. పన్నుల వసూలు విషయంలో ఏమాత్రం అశ్రద్ధ వహించవద్దని కమిషనర్ సూచించారు. ముఖ్యంగా పన్నుల చెల్లింపు విషయంలో ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రతీ వార్డుకు నోడల్ ఆఫీసర్, అడ్మిన్, సెక్రటరీలను ఏర్పాటు చేసి పన్నుల వసూలు బాధ్యత అప్పగించాలని సూచించారు. ఆయా డివిజన్లలో మొండి బకాయిదారుల నుంచి పన్నులను వసూలు చేయడంలో వీరందరూ ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు. వార్డులోని పన్నులను నోడల్ ఆఫీసర్, సర్కిల్ పరిధిలోని పన్నులు ఆయా సర్కిల్ ఆఫీసర్లు వసూలు చేయాలన్నారు. పన్నులపై ఏప్రిల్ నుంచి వడ్డీ పెరిగే అవకాశముందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అలాగే మార్కెట్ రేటు పెరిగిన నేపథ్యంలో పన్నులు రివైజ్ చేసే అవకాశముందని ఆ విషయాన్ని కూడా వివరించి పన్ను బకాయిలను త్వరితగతిన చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ కెటి సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, నగరపాలక కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మేనేజర్ సత్యనారాయణ, ఆర్వో శిరీష్, టీపీఆర్వో శైలజ, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

'స్వయం ఉపాధికి సబ్సిడీ రుణాలిప్పించాలి'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధికి సబ్సిడీ రుణాలిప్పించి ఆదుకోవాలని కాకినాడ జిల్లా సౌండ్ సిస్టమ్ ఓనర్స్, హెల్పర్స్ సంక్షేమ సంఘం ప్రతినిధులు మంత్రి సుభాష్‌ను కోరారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను రామచంద్రపురంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇళ్ల స్థలాలు, ఇన్సూరెన్స్‌లు, వైద్య సదుపాయాలు పొందేందుకు అవసరమైన సహకారం అందించాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సౌండ్ సిస్టమ్ ఓనర్స్ హెల్పర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నడికట్ల లోవరాజు, కార్యదర్శి కుక్కల గనిరాజు, ఉపాధ్యక్షుడు పెంకే మారయ్య, కోశాధికారి డింగ్ రాజు, పాలిక సత్యనారాయణ, కిరణ్ గౌరవ అధ్యక్షుడు కుమార్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

'చిరస్థాయిగా విద్య'


లెక్చరర్ రామారావును సత్కరిస్తున్న దృశ్యం

పిఠాపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నేర్పించిన విద్య చిరస్థాయిగా నిలుస్తుందని ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం విశ్రాంత వైస్‌చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జి అన్నారు. కళాశాలలో ఆంగ్ల లెక్చరర్‌గా పనిచేస్తూ ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్న పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల డాక్టర్ కాశి రామారావు దంపతులను శనివారం కళాశాలలో ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ వి.కేశవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అడిషనల్ డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ పవన్‌కుమార్, కాకినాడ బుద్ధవిహార్ అధ్యక్షుడు రామేశ్వరరావు, సత్యనారాయణ, విశ్రాంత ఆర్ఐవో ఆరోరా, విశ్రాంత ప్రిన్సిపాల్స్ పి.చంద్రరావు, కేపీ జగదీశరావు, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వర్శిటీలోని సెంట్రలైజ్డ్ కంప్యూటర్ సెంటర్లో రెండు రోజుల పాటూ ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో యూనివర్శిటీ, యూసీఈకే అధ్యాపకేతర సిబ్బందికి ఎంఎస్ ఆఫీస్‌పై నిర్వహించిన శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా ఓఎస్డీ డి.కోటేశ్వరరావు హాజరయ్యారు. శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందికి అతిథుల చేతులమీదుగా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రఘురాం, సాగర్, కశ్యప్, వెంకట్ ఉన్నారు.

'మానవతా దృక్పథం గల వృత్తి నర్సింగ్'

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మానవతా దృక్పథం గల వృత్తి నర్సింగ్ అని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ అన్నారు. కాకినాడ శ్రీనగర్ ఆదిత్య ప్రాంగణంలో శనివారం సాయంత్రం ఆదిత్య నర్సింగ్ సంస్థల విద్యార్థినుల కేపింగ్ సెరిమనీని నిర్వహించారు. ఆదిత్య చైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ సుగుణారెడ్డి, కార్యదర్శి దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా డీఎంహెచ్‌వో, గౌరవ అతిథులుగా కాకినాడ జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్లు సంధ్యారాణి, జయశ్రీ పాల్గొన్నారు. విద్యార్థినుల నృత్యాలు,వినోద కార్యక్రమాలు అలరించాయి.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

శృంగార వల్లభస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

రూ.4,56,997 ఆదాయం


నిత్యాన్నదానానికి హాజరైన భక్తులు

పెద్దాపురం (సామర్లకోట), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తొలితిరుపతిగా ప్రసిద్ధి పొందిన పెద్దాపురం మండలం చదలాడ తిరుపతి గ్రామంలో స్వయంభుగా వెలసిన శృంగార వల్లభస్వామి ఆలయం మాఘమాసం మహాపర్వదినాలు పురస్కరించుకుని ఆలయ ఆవరణలో వేలాది భక్తజనంతో శనివారం కిక్కిరిసింది. తెల్లవారు జామున 3 గంటల నుంచే ఆలయ ఆవరణలో అన్ని క్యూలైన్లు భక్త జనంతో నిండిపోయాయి. వారికి అసౌకర్యం లేకుండా ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు ఏర్పాట్లు నిర్వహించారు. సుమారు 30 వేల మంది స్వామివారిని దర్శించుకున్నట్టు ఈవో చెప్పారు. ఆలయానికి రూ. 4,56,997 ఆదాయంగా లభించినట్టు చెప్పారు.

కేంద్ర బడ్జెట్‌పై సమావేశం

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ 2025-26పై మేధావులతో కాకినాడ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో నాగమల్లి తోట వద్ద చోడే అప్పారావు ప్రకృతి చికిత్సాలయం యోగా కేంద్రం నందు సమావేశం నిర్వహించారు. బీజేపీ నాయకులు మేధావులు పాల్గొని కేంద్ర బడ్జెట్‌లో వివిధ అంశాలకు ఇచ్చిన ప్రాధాన్యతపై చర్చించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా ఓడల నిర్మాణానికి బడ్జెట్‌లో పెద్దపీట వేస్తూ రూ.20వేల కోట్లతో నిధిని ఏర్పాటు చేసి ప్రోత్సహించడం జరిగిందన్నారు. తద్వారా ఓడల నిర్మాణశాతం పెంచే విధంగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఫైడా భావనప్రసాద్, గండి కొండలరావు, డివిఎస్ రాజు, కేజీఆర్, రమణమూర్తి, కొండేపూడి ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలి

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని ఎమ్మెల్యేలు, నాయకుల ప్రచారం



కాకినాడలో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు, సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ



పిఠాపురంలో సమీక్షిస్తున్న పీలా గోవిందు, జగదీష్, వర్మ.. కరప: వేములవాడలో ప్రచారం చేస్తున్న నాయకులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులంతా కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం జగన్నాధపురంలోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్, ఫెలోషిప్ సభ్యులతో, రామారావుపేటలో జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీ బ్యాంకు ఖాతాదారుల వెల్ఫేర్ కమిటీ కార్యవర్గంతో సమావేశమై రాజశేఖర్‌కు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. భవిష్యత్తులో పట్టభద్రులకు మంచి జరగాలంటే కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సమావేశాల్లో బ్యాంకు ఖాతాదారుల వెల్ఫేర్ కమిటీ చైర్మన్ గంగిరెడ్డి త్రినాధరావు, డైరెక్టర్లు కె గౌరీశంకరావు, చింతా సుబ్బారావు, పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు సుందరం, సింహాద్రి, మోస ఐజాక్, రత్న కుమార్, ఎం.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజశేఖర్‌కు మద్దతుగా కాస్మోపాలిటిన్ క్లబ్‌లో కేఎల్‌బీ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత, జిల్లా టీడీపీ బీసీ సెల్ నేత కొల్లుబోయిన శ్రీనివాస యాదవ్ ఆధ్వర్యంలో రియల్ ఎస్టేట్ సంస్థల అనుబంధ మిత్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ప్రసంగించారు. సమావేశంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, సిటీ నియోజకవర్గ పరిశీలకులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, అల్లాడి స్వామినాయుడు కొల్లుబోయిన ప్రసాద్, టీడీపీ నాయకులు తుమ్మల రమేష్ వొమ్మి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టాలి

అసెంబ్లీ ఎన్నికల్లో తనకు 72 వేల మెజారిటీ ఇచ్చారని, అదే విధంగా ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి రాజశేఖర్‌కు భారీ మెజారిటీ లభించే విధంగా కూటమి శ్రేణులు శ్రమించాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. స్థానిక కాస్మోపాలిటిన్ క్లబ్‌లో శనివారం రూరల్ నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో 16 వేల మంది పైగా పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని, వారందరూ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అభివృద్ధికి పట్టం కట్టాలన్నారు. సమావేశంలో ఎన్టీఆర్ వైద్య ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ శీతంరాజు సుధాకర్, రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు కుడుపూడి సత్తిబాబు, రూరల్ నియోజకవర్గ కో కో కన్వీనర్ కటకంశెట్టి బాబీ, కూటమి నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, పెంకే శ్రీనివాసబాబా, మట్టా ప్రకాష్‌గౌడ్, వల్లూరి రాజా, కరెడ్ల గోవింద్, సిరంగు శ్రీను, దేవు వెంకన్న, తాటికాయల వీరబాబు, బోగిరెడ్డి గంగాధర్, గంజా దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు ప్రథమ ప్రాధ్యానత ఓటు వేయించడం ద్వారా భారీ మెజార్టీతో గెలిపించేలా కృషి చేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, మాజీ ఎమ్మెల్సీ దారపురెడ్డి జగదీష్, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందు సత్యనారాయణ, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ కోరారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో పార్టీ ముఖ్యనేతలతో ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలవడంతో పాటు మొదటి ప్రాధాన్యత ఓటు ఎలా వేయాలనే అంశంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎమ్మెల్సీ ప్రచార ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కొత్తపల్లి: పేరాబత్తులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి విజయం చేకూర్చాలని పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పట్టభద్రులను అభ్యర్థించారు. కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు రామన్నపాలెంలో ప్రచారం నిర్వహించారు. జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు. పేరాబత్తులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీ తీసుకురావాలని కొండెవరంలో టీడీపీ నాయకుడు వేమగిరి రాంబాబు పట్టభద్రుల ఓటర్లను కోరారు.

కరప: ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తులకు భారీ విజయం చేకూర్చేలా అందరూ కష్టపడి పనిచేయాలని టీడీపీ కాకినాడరూరల్ కో కో-ఆర్డినేటర్ కటకంశెట్టి బాబి, ఎన్నికల సమన్వయకర్త నులుకుర్తి వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడుపూడి సత్తిబాబు సూచించారు. కరపమండలం వేములవాడలో కూటమి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అధికారులు, గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి కరపత్రాలను అందజేశారు. కరప డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పీజీ సత్యనారాయణ(బాబుబు), నాయకులు మట్టా ప్రకాష్ గౌడ్, దేవు వెంకన్న, గుల్లిపల్లి శ్రీనివాసరావు, కోన వెంకటలక్ష్మి, పాలిక సూరిబాబు ఉన్నారు.

పాదగయ క్షేత్రంలో జల్లు స్నానానికి ఏర్పాట్లు


పిఠాపురం పాదగయ క్షేత్రంలో జల్లు స్నానానికి చేస్తున్న ఏర్పాట్లు

పిఠాపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాదగయ క్షేత్రంలో నూతనంగా జల్లు స్నానానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మహాశివరాత్రితో పాటు ఇతర ముఖ్యమైన పర్వదినాల్లో పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భారీగా భక్తులు సంఖ్యలో తరలివస్తూ ఉంటారు. భక్తులు భారీగా తరలివచ్చిన సమయంలో వృద్ధులు, చిన్నారులు స్నానాలు ఆచరించేందుకు ఇబ్బందులు పడేవారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓఎస్డీ మధుసూదన్ సూచించారు. ఈ నేపథ్యంలో జల్లు స్నానం ఆచరించేందుకు వీలుగా షవర్లు ఏర్పాటు చేశారు. పాదగయ పుష్కరిణి చుట్టూ జల్లు స్నానం ఆచరించే వీలు కల్పిస్తున్నారు. పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తూ ఉంటారని, వారి సౌకర్యార్థం వీటిని ఏర్పాటు చేశామని పాదగయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు. పుష్కరిణిలో స్నానాలు ఆచరించలేని భక్తుల కోసం ఈ ఏర్పాటు చేశామని చెప్పారు.

భీమేశ్వరాలయంలో ఏర్పాట్లు పూర్తి

సామర్లకోట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాలు పురస్కరించుకుని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో లక్షలాది భక్తులు హాజరుకానున్నందున ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పవిత్రస్నానాలు ఆచరించేందుకు ఆలయ పుష్కరిణితో బాటూ, ముఖ ద్వారం వద్ద దాతలు సమకూర్చిన జల్లుస్నాన ఘట్టం కూడా భక్తుల కోసం సిద్ధం చేశారు. బుధవారం తెల్లవారు జామున 1 గంట నుంచి స్వామి వారి మూలవిరాట్ నందు అభిషేకాలు నిర్వహిస్తారని ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం చెప్పారు. బుధవారం సాయంత్రం సదస్య పూజలు, రాత్రికి రుద్రాభిషేకాలు, లింగోద్భవ కాల పూజలు పిఠాపురం రాజా వారి గోత్రనామములతో దేశంలోని 12 ప్రముఖ పుణ్యనదుల నుంచి సేకరించిన పవిత్ర జలాలతో అభిషేకపూజలు నిర్వహిస్తామన్నారు. 27న రథోత్సవం మధ్యాహ్నం 2.20 గంటలకు ప్రారంభిస్తామన్నారు. 28న త్రిశూలస్నానం, తీర్థపుసేవ, మార్చి 1న స్వామి, అమ్మవారికి రాత్రి 7.45 నిమిషాలకు శ్రీ పుష్పయాగ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి కల్యాణపూజలు ప్రారంభం పురస్కరించుకుని శనివారం స్వామి, అమ్మవార్లను నూతన వధూవరులుగా విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

'పరిసరాల పరిశుభ్రత పాటించాలి'


సర్పవరం జంక్షన్: తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఈవోపీఆర్డీ

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత పాటించాలని, తడి,పొడి చెత్త వేరు చేసి పంచాయతీ కార్మికులకు అందించాలని, ప్లాస్టిక్ వ్యర్థాలు బయట పారేయరాదని ఎంపీడీవో పసుపులేటి సతీష్, ఈవోపీఆర్డీ శ్రీరామాంజనేయులు కోరారు. శనివారం కాకినాడ రూరల్ మండలంలో గ్రామ కార్యదర్శి పిడుగు పాండురంగారావు, రమణయ్యపేట కార్యదర్శి జొన్నాడ నరసింహరావు, వలసపాకల కార్యదర్శి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య అవగాహన కార్యక్రమంలో భాగంగా ఇంటింట గార్బేజ్ కలెక్షన్ నిర్వహించారు. ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వీధులు, డ్రైనేజీల్లో పారేయకుండా సంచిలో వేసి పంచాయతీ శానిటేషన్ వర్కర్లకు అందించాలన్నారు. తడి, పొడి చెత్తతో చెత్తనుంచి సంపద సృష్టించి పంచాయతీకి ఆదాయం సమకూరేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగుతుందన్నారు. గ్రామస్తులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, శానిటేషన్ వర్కర్లున్నారు.

చెత్త సేకరణపై స్పెషల్ డ్రైవ్

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని 10 గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించారు. చినజగ్గంపేట, తాటిపర్తి తదితర గ్రామాల్లో తడి, పొడిచెత్తను ఎలా వేరు చేయాలో ఈవోపీఆర్డీ కుమార్ ప్రజలకు అవగాహన కల్పించారు.

కొత్తపల్లి: తడి, పొడి చెత్త సేకరణపై మండలంలో పలు గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కొత్తపల్లి, ఉప్పాడ, అమీనబాద్ గ్రామాల్లో పంచాయతీ అధికారులు, పారిశుధ్య సిబ్బంది ఇంటింటి వెళ్లి తడి, పొడి చెత్తను నిలువ చేసి పారిశుధ్య కార్మికులకు ఇచ్చే విధానంపై ఈవోపీఆర్డీ సత్యారెడ్డి గ్రామస్తులకు వివరించారు. పంచాయతీల ద్వారా ఇళ్లకు పంపిణీ చేసే డబ్బాల్లో ఎరుపు రంగు డబ్బాలో పొడి చెత్త, పచ్చరంగు డబ్బాలో తడి చెత్తను వేయాలని వారు వివరించారు. పంచాయతీ కార్యదర్శులు ఆర్ఎస్‌కుమార్, ఎన్.శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

చేపలకు మంచి గిరాకీ

బర్డ్‌ఫ్లూ హెచ్చరికలతో తగ్గిన మాంసం విక్రయాలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ మార్కెట్లో చేపలకు మంచి గిరాకీ ఏర్పడింది. ఇటీవల బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకి ఫారాల్లో కోళ్లు మృత్యువాత పడడం, దాంతో కోడి మాంసం, గుడ్లు కాని తినరాదని హెచ్చరికలు జారీ చేయడంతో కొత్తపల్లి మండలంలో కోడి మాంసాల విక్రయాలను నిలిచిపోయాయి. దీంతో ఉప్పాడ, అమీనబాద్ మార్కెట్లలో చేపలకు మంచి డిమాండ్ ఏర్పడింది. చిన్నచేపలైనా పర్లేదు కొనుగోలు చేసుకొని పట్టుకెళ్లిపోతున్నారు. సాధారణ రోజుల్లో ఊరికినే ఇచ్చినా తీసుకోని ఖానా గొరసలు ప్రస్తుతం 4 చేపలు రూ.100 వరకు డిమాండ్ ఏర్పడింది. మొరాలు, కిలాలు కూడా ఇదే తరహాలో అమ్ముడుపోవడం విశేషం. ఇక పెద్ద జాతులైన ఇంజరం, కోనాం, స్రొర, సంధువాలు గతంలో కంటే అధిక రేట్లు పలుకుతున్నాయి. కోడి మాంసం అమ్మకాలు లేకపోవడంతో అధికశాతం మాంసాహారులు చేపలను కొనగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇక మాంసం దుకాణాల్లో మేక బదులు గొర్రె మాంసం విక్రయిస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. మేక మాంసం రేటు కూడా గణనీయంగా పెంచడం, పెంచిన రేటుకు అనుగుణం గా మేక మాంసం దొరకకపోగా గొర్రె మాంసం అమ్ముతున్నారని ఆరోపిస్తున్నారు. మేక మాంసం విక్రయాలపై సంబంధిత పశుసంవర్ధక శాఖాధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


ఉప్పాడ మార్కెట్లో వివిధ రకాల చేపలు

మహాశివరాత్రికి భారీగా ఏర్పాట్లు : వర్మ

పిఠాపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినాల సమయంలో తరలివచ్చే లక్షలాది మంది భక్తులు కోసం కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పాదగయ క్షేత్రంలో ఆయన శనివారం పూజలు నిర్వహించారు. కుక్కుటేశ్వర స్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకున్నారు. శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించారు. తాను ఎమ్మెల్యేగా ఉండగా పాదగయ క్షేత్రం అభివృద్ధికి రూ.10కోట్లుతో ప్రణాళిక రూపొందించగా సీఎం చంద్రబాబు తొలివిడతగా రూ.2.70 కోట్లు టీటీడీ నుంచి మంజూరు చేశారని తెలిపారు. పాదగయ మాజీ చైర్మన్ కొండేపూడి సూర్యప్రకాష్, నాయకులు తదితరులున్నారు.

నేడు రాష్ట్ర స్థాయి చిన్నారుల నాటికలు, సాంస్కృతిక పోటీలు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ చిల్డ్రన్స్ థియేటర్, దంటు సూర్యారావు స్మారక నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం దంటు కళాక్షేత్రం ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి చిన్నారుల నాటికలు, సాంస్కృతిక ప్రదర్శనల పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు దంటు భాస్కరరావు, పివి రావు, నాదెళ్ల ప్రభుదాసు, ఎంవి రమణ తెలిపారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులతో నాటికల ప్రదర్శనలు జరుగుతాయన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి ప్రారంభమయ్యే నాటికల పోటీలు రాత్రి వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు.

దేవదాయశాఖ సత్రాలు, ఆలయాల వర్గీకరణ మార్పు

పిఠాపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ ఆధీనంలోని సత్రాలు, ఆలయాల వర్గీకరణను మార్పు చేస్తూ దేవదాయశాఖ కమిషనరు కె.రామచంద్రమోహన్ జారీ చేశారు. జిల్లాలోని పిఠాపురంలో గల సంస్థానసత్రం, జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలోని పీఎల్‌వీ చౌల్ట్రీ, కాకినాడ నగరంలోని ఫైడా చలమయ్య సత్రంలను 6(ఏ)(ఐ)నుంచి 6(బి)(ఐ)కి మార్పు చేశారు. అదే విధంగా వివిధ ప్రాంతాల్లోని 18 సత్రాలను 6(బి)(ఐ) నుంచి 6(సీ)(ఐ)కు, 61 ఆలయాలను 6బీ(ఐఐ) నుంచి 6(సీ)(ఐఐ)కు మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయా ఆలయాలు, సత్రాల ఆదాయాలను పరిగణలోకి తీసుకుని ఈ మార్పులు చేశారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శంఖవరం, హంసవరం ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఏప్రిల్ 20న రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశపరీక్షలు నిర్వహించనున్నారని డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఈ ఏడాది 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఈనెల 24 నుంచి మార్చి 31 వరకూ దరఖాస్తుచేసుకోవచ్చని సూచించారు. వివరాలకు 9491249321, 7032996442లో సంప్రదించాలన్నారు.

'పాడా పేరుతో మా పొట్ట కొట్టవద్దు'

పిఠాపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పాడా పేరుతో మా పొట్ట కొట్టవద్దని చిరువ్యాపారులు, దుకాణాల నిర్వాహకులు కోరారు. పిఠాపురంలోని పాతబస్టాండు వద్ద గల మున్సిపల్ అతిథిగృహంలో పాడా కార్యాలయం ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో సినిమాసెంటర్ నుంచి రథాలపేట అంబేద్కర్ సెంటర్ వరకూ గల దుకాణాలు, చిరువ్యాపారులు చేసుకునే వారి బండ్లను, ఇతర బడ్డీ కొట్లను, టాక్సీస్టాండును సోమవారం లోగా ఖాళీ చేయాలని మున్సిపల్ అధికారులు ఆదేశించారు. దీంతో వారంతా పిఠాపురం మున్సిపల్ కమిషనరు నామా కనకారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఏళ్ల తరబడి వ్యాపారాలు సాగిస్తూ జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు దుకాణాలు తొలగించమంటే ఎలాగని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయం చూపించకుండా తొలగించడం సమంజసం కాదని తెలిపారు. పాడా కార్యాలయం ఏర్పా టు నేపథ్యంలో ఆక్రమణలు తొలగించాలని ఉన్నతాధికారులు ఆదేశించారని కమిషనరు చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే దొరబాబును కలిసిన ఎంపీ తంగెళ్ల

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ శనివారం వలసపాకలలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. దొరబాబు గృహ ప్రవేశానికి ఎంపీని ఆహ్వానించడం, ఆ సమయంలో ఆయన అందుబాటులో లేకపోవడంతో శనివారం మాజీ ఎమ్మెల్యే నివాసానికి మర్యాదపూర్వకంగా వచ్చినట్లు ఎంపీ అనుచరులు తెలిపారు. వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే దొరబాబును జనసేన పార్టీకి చెందిన ఎంపీ కలుసుకోవడం రాజకీయంగా సర్వత్ర చర్చనీయాంశంగా మారింది.

గ్రూప్-2 అభ్యర్థుల ధర్నా

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 అభ్యర్థులు రెండోరోజు శనివారం కూడా కాకినాడలో ఉన్న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. రోస్టర్ విధానంలో తప్పులను సరిదిద్దిన తర్వాతే గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

కోటనందూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కోటనందూరులో ఏర్పాటుచేసిన రెండు బూత్‌లను శనివారం సెక్టార్ అధికారి ఆనంద్ పరిశీలించారు. ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. మండలంలో ప్రతీ ఒక్కరూ ఓటు వేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. తహశీల్దార్ సుబాష్, డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ, రూట్ ఆఫీసర్ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మన్యం కొండ జాతర ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

● చింతూరు ఇన్‌చార్జ్ ఐటీడీఏ పీవో కల్పనా



ముత్యాలమ్మ అమ్మవారు

మోతుగూడెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జలపాతంవద్ద మార్చి 3న బడాయాత్రకు జాతర ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జ్ ఐటీడీఏ పీవో కల్పన ఆదేశించారు. ఏజెన్సీలోని గిరిజన తెగలకు సంబంధించిన పండుగలుఉత్సవాలు నిర్వహించుకుని సంస్కృతిక సంప్రదాయాలు కాపాడుకునే బాధ్యత ఈ గిరిజన తెగలపై ఉందన్నారు. మోతుగూడెం, చింతూరు ఎస్ఐ లు, డివిజన్ ఫారెస్ట్ ఆఫీసర్, ఏపీ జెన్‌కో సూ పరింటెండెంట్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ సివిల్ ఇంజనీర్, చింతూరు తహసీల్దార్, చింతూరు ఎంపీడీవో, మోతుగూడెం పంచాయతీ కార్యదర్శి, డీఈఈ, అర్అండ్ అర్, పొల్లూరు ఫెస్టివల్ కమిటీ మలికార్జున్, మోతుగూడెం ఎస్ఐఎఫ్, మోటార్‌సైకిల్ ఇన్‌స్పెక్టర్, డీఎంహెచ్‌వో, ఫైర్ ఆఫీసర్, డీపీడీసీఎల్, సర్పంచ్‌లకు వారివారి విధులు నిర్వహించడానికి జాతర2 కమిటీ వేశారు. కరపత్రాన్ని ఆవిష్కరించారు.

పాపికొండల అభయారణ్యంలో

మత్స్య సంపద దోపిడీ

● మైదాన ప్రాంతానికి తరలిపోతున్నా పట్టించుకోని యంత్రాంగం



బాక్సుల్లో ఉన్న చేపలు

దేవీపట్నం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): దేవీపట్నం మండలాన్ని ఆనుకుని ఉన్న పాపికొండల అభ యారణ్యం గోదావరినదిలో నెలలు తరబడి జరుగుతున్న మత్స్య సంపద దోపిడీ ఇప్పటికీ ఆగలేదు. మైదాన ప్రాంతాలైన నక్కపల్లి, ధవళేశ్వరం, పోలవరం, కొవ్వూరుకు తరలిపోతున్నా అధికారులు ఏమీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పెద్ద చేప దగ్గర నుంచి చిన్నకన్నుల చేప వరకు వేటగాళ్లు వదలడంలేదు. రాత్రి సమయంలో టన్నులకొద్దీ చేప పిల్లలను ఎండబెట్టి బొలెరో వాహనాల్లో తరలించుకుపోతున్నారు. వీటికి ఇతర రాష్ట్రాల్లో మంచి ధర పలకడంతో వీరి దోపిడీకి అడ్డూఅదుపూ లేకుండాపోతుంది. వీరవరం, పోశమ్మగండి, పూడిపల్లి గ్రామాల నదిఒడ్డు నుంచి తెల్లవారుజామున 3గంటల సమయంలో పురుషోత్తపట్నం మీదుగా దండంగి, ఇందుకూరుపేట వయా ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నారు. శనివారం గోకవరం మండలం కృష్ణుడిపాలెం ఆర్అండ్ఆర్ కాలనీలో తుని మండలానికి చెందిన మత్స్యకారుడు గోదావరినదిలో చిన్నచేపలు వేటాడి ఆరబెట్టిన సమాచారం తెలుసుకున్న అధికారులు అక్కడికి చేరుకున్నారు. గోదావరి నదిలో చేపల వేట నేరమని మళ్లీ వేటాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో, మేజర్ పంచాయతీ ఈవో

కూనవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తపై కూనవరం మేజర్ పంచాయతీలో తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో రామాంజనేయులు, మేజర్ పంచాయతీ ఈవో సురేష్ ఇంటింటికీ వెళ్లి ప్రజల్లో అవగాహన పెంచారు. ప్రతీరోజూ చెత్త బయట పారవేయకుండా తడి, పొడి చెత్తలను వేరుచేసి ఇంటి వద్ద ఉంచితే పారిశుధ్య కార్మికులు వచ్చి అవి తీసుకెళతారని వారు తెలిపారు. కూనవరం మేజర్ పంచాయతీని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతీఒక్కరూ కృషిచేయాలన్నారు. గ్రీన్ పంచాయతీగా అభివృద్ధి చేసేందుకు ముందుకు రావాలన్నారు.

ఏపీ జెన్కో మైదానంలో క్రికెట్ పోటీలు ప్రారంభం



చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్ మీనా, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ జీఎం వాసుదేవరావు క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): చింతూ రు మండలం మోతుగూడెంలో శనివారం శ్రీదులే భగవత్ రామ్‌లక్ష్మి తల్లిదండ్రులు జ్ఞాపకార్థం చిన్న కుమారుడు దులారి గోపి ఏపీ జెన్కో మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్‌మీనా, సీలేరుకాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ జీఎం వాసుదేవరావు విచ్చేశారు. ముందుగా సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్ మీనాకుపుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు. అనంతరం వీరు మాట్లాడుతూ క్రికెట్ స్నేహపూర్వకంగా ఆడాలన్నారు. ఈ సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్‌కి 42జట్లు వస్తున్నాయని ఆంధ్ర, చతీస్‌ఘడ్, ఒడిశా ఈ మూడు రాష్ట్రా లు క్రికెట్ జట్లు వస్తాయని తెలిపారు. మొదటి బహుమతి రూ.50వేలు, రెండో బహుమతి రూ.25 వేలు, మూడో బహుమతి రూ.10వేలు అని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ఏపీ జెన్కో సూపరింటెండెంట్ ఇంజనీర్ చెన్న కేశవరావు, డీఈటీ వరప్రసాద్, ప్లాంట్ మేనేజర్ బి.బాలకృష్ణ, మోతు గూడెం ఎస్ఐ శివన్నారాయణ, డీఏవీ పాఠశాల ఉపాధ్యాయు లు మల్లెల రఘురాం, రత్నాకర్ పాల్గొన్నారు

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తులను గెలిపించండి

దేవీపట్నం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరు1 ఏనుగులగూడెం అగ్రహారం ఆర్అండ్ఆర్ కాలనీలో దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారం నిర్వహించారు. ఉభయగోదావరిజిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి నుంచి పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ఆదేశాల మేరకు పట్టభద్రులు ఉన్న ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ వాణిజ్య విభాగం నాయకులు కొత్తపల్లి సత్యనారాయణ(అన్నవరం), కూటమి నాయకులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి గెలుపుకోసం ప్రచారం

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగిలో శనివారం సీపీఎం పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారం హాజరై మాట్లాడారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డీవీ రాఘవులు గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. కూటమి అభ్యర్థికి ఓటమి భయం పట్టుకుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో బొప్పెన కిరణ్, లోత రామారావు, కొండ్ల సూరిబాబు, రామరాజు, జగన్నాధం, శ్రీను, అచ్చా రావు, సత్యనారాయణ, పాపారావు పాల్గొన్నారు.

గుండాల జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు

ఎటపాక, ఫిబ్రవరి.22 (ఆంధ్రజ్యోతి) విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిమీద గుండాల వద్ద శనివారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. సీఐ కన్నపరాజు, ఎస్ఐ అప్పలరాజు ఆధ్వర్యంలో క్షుణ్ణంగా వాహన తనిఖీలు చేపట్టారు. సరిహద్దులోని మూడు రాష్ట్రాల నుంచి ఇటువైపుగా రాకపోకలు సాగించే వాహనాలు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ క్రమంలో పోలీసులు రోడ్డు ప్రమాదాలపై, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాహనదారులకు అవగాహన కల్పించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించండి

పలు చోట్ల ఎన్నికల ప్రచారం



ఏలేశ్వరంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటువేసి గెలిపించాలని శనివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, పార్టీ పరిశీలకుడు గంటా నూకరాజు, మెట్ల రమణబాబు ప్రచారం చేశారు. స్థానిక 2వ వార్డు షిర్డీనగర్‌లో ఇంటింటికీ తిరిగి తమ అమూల్యమైన ఓటును రాజశేఖర్‌కు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, టీడీపీ పట్టణ శాఖ మూది నారాయణస్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, కూటమి నాయకులు పెంటకోట మోహన్, పరవాడ రమేష్, రాతికింద కృష్ణారావు, రెడ్డి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పేరాబత్తుల విజయం కోరుతూ కోటనందూరు హైస్కూల్‌లో కూటమి కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల వద్దకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు పేరాబత్తులకు ఓటేసి గెలిపించాలని మాజీ ఎంపీపీ డి.చిరంజీవిరాజు కోరారు. కెఎస్ఎన్.సత్యనారాయణ, మాజీ సర్పంచ్ బోడపాటి సత్యనారాయణ, చింతకాయల రవికుమార్, పల్లా రామకృష్ణ, ముక్కుడపల్లి లోవరాజు, బడుగు రాజ్‌కుమబార్ పాల్గొన్నారు.

శంఖవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ కోరారు. శనివారం శంఖవరం పరిసర ప్రాంతాల్లో పార్టీ ఎన్నికల పరిశీలకుడు గంటా గోపీతో కలిసి ఆయన పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి పేరాబత్తులను గెలిపించాలని కోరారు. చింతంనీడి కుమార్, బొర్రా వాసు, బొర్రా ప్రసాద్, రౌతు శ్రీను పాల్గొన్నారు.

'ఆదిత్య'లో యూత్ లీడర్‌షిప్ వర్క్‌షాప్

గండేపల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ విద్యార్థుల్లో నాయకత్వాన్ని ప్రేరేపించేందుకు వికసిత్ భారత్ చొరవకింద రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో యూత్ లీడర్‌షిప్ కార్యక్రమం నిర్వహించినట్టు యూనివర్శిటీ డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి రిటైర్డ్ లెక్చరర్, మోటివేషనల్ స్పీకర్ సలాది శ్రీరామచంద్రమూర్తి, పెద్దాపురం సీఐ ఆర్.అంకబాబు ముఖ్యఅతిథులుగా హాజరై నాయకత్వం, ప్రేరణ, దేశ నిర్మాణంపై అభిప్రాయాలను పంచుకున్నారు. విద్యార్థుల వ్యక్తిగత, వృత్తిపరమైన వృద్ధికి సాధికారత గల అంశాలపై చర్చించారు.

ముగిసిన అతిథి ఉపన్యాసం

సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ ఇన్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ అనే అంశంపై అతిథి ఉపన్యాసం శనివారం ముగిసింది. ఎస్ఈజీఐ విశ్వవిద్యాలయం మలేసియాలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న ఆచార్య రాజ్‌మోహన్ పార్థసారథి ఆన్‌లైన్‌లో పలు అంశాలు వివరించారు. విద్యార్థులు పాల్గొని ఎన్నో సందేహాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో యూనివర్శిటీ డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడారు.

జ్యోతుల నవీన్ పరామర్శ

జగ్గంపేట, ఫిబ్రవరి 22 (ఆంధజ్యోతి): గోవిందపురానికి చెందిన టీడీపీ నాయకుడు గొట్టి ముక్కల వెంకటవల్లి సుబ్రహ్మణ్యం (నాని) రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకోవడంతో ఆయన్ని శనివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, రాజపూడి సర్పంచ్ బుసాల విష్ణు, కమ్మెల దుర్గాప్రసాద్, మారిశెట్టి రాధా, రాయిస్వామి, బొండా రాజేష్, వెలిశెట్టి శ్రీను, వెలిశెట్టి బుజ్జి, మండపాక అప్పన్నదొర, కొండ్రోతు శ్రీను ఉన్నారు.

బాధిత కుటుంబాలకు సాయం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): పోతులూరుకు చెందిన ఇంధన రాము, ముప్పిడి అర్జునుడు, వల్లు ఏసుబాబులు ఇటీవల మృతి చెందారు. శనివారం బాధిత కుటుంబాలకు ఒకొక్కరికి రూ.5వేలు వంతున ఎంఎంఆర్ ట్రస్టు చైర్మన్ మురళీరాజు అందజేశారు. సర్పంచ్ బొండి రాంబాబు, గ్రామపెద్ద శెట్టి సత్తిబాబు, ఎంపీటీసీ ముప్పిడి ఏసుబాబు, నాగేశ్వరరావు, ఎలుగుబంటి బాబ్జి, చెక్కపల్లి బుజ్జి, శెట్టినాగరాజు, కొల్లు మునలయ్య, నానిపల్లి చంటి, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, కోలా సూరిబాబు, నల్లా వెంకటేష్, యాళ్ళ ఏసు పాల్గొన్నారు.

రామవరంలో చెత్త సేకరణ

జగ్గంపేట రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రామవరం గ్రామంలో ఇంటింటికి చెత్త సేకరణ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ పాల్గొన్నారు. పారిశుధ్యంపై పూర్తిస్థాయి చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామ సచివాలయం వద్ద పంచాయతీ అధికారి సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆరోగ్య, పారిశుధ్య, పంచాయతీ సిబ్బందితో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎంపీడీవో ఏవీఎస్ చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ సూర్యభాస్కర్‌రావు, పంచాయతీ కార్యదర్శి శివ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలి



మాట్లాడుతున్న కొండేపూడి శ్యామ్‌బాబు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాదిగలకు న్యాయం చేకూర్చాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కొండేపూడి శ్యామ్‌బాబు డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు మండలంలోని రాచపల్లి అడ్డురోడ్డు సెంటర్ వద్ద శనివారం సాయంత్రం ప్రత్తిపాతు, తుని, పిఠాపురం నియోజకవర్గాలకు చెందిన ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ధర్మవరం మాజీ సర్పంచ్ కాపారపు రాజబాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా శ్యామ్‌బాబు మాట్లాడుతూ వర్గీకరణకు కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలుచేపట్టాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ అమలు కోసం మార్చి 19న ధర్మవరం నుంచి ప్రత్తిపాడు తహశీల్దార్ కార్యాలయం వరకు మాదిగల దండోరా ర్యాలీ భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మాదిగలంతా తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మాదిగల కులాల నాయకులు కె.రాజబాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు దూలపల్లి నానిబాబు, గెద్దం సుబ్బిరాజు, కొమ్ముకూరి సత్యనారాయణ, మోర్త సత్తిబాబు, కాపారపు నూకరాజు, బోడపాటి సత్తిబాబు, పలివెల నూకరాజు, పలివెల సతీష్, బోడపాటి బుల్లెమ్మ, కొండమ్మ, చంటిబాబు, పెదపూడి గంగయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా లయన్స్ క్లబ్ గోల్డెన్‌జూబ్లీ వేడుకలు



లయన్స్‌క్లబ్ గోల్డెన్ జూబ్లీ కార్యక్రమం దృశ్యం

గండేపల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ప్రారంభించి 50ఏళ్ల పూర్తి కావడంతో శనివారం మండలంలో నీలాద్రిరావుపేట గ్రామశివారున ఉన్న బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎంఎస్ బాలగంగాధర్ ఆధ్వర్యంలో గోల్డెన్ జూబ్లీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్‌లో సీనియర్లకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ జి.బాబురావు, పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ చిగురుపాటి వరప్రసాద్, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇవీవీ ఈశ్వర్‌కుమార్, పి.సుభాష్ బాబు, వజ్రపు కోటేశ్వరరావు, చిట్నీడి శ్రీనివాసరావు, సెక్రటరీ డాక్టర్ పద్మావతి, కొత్త కొండబాబు, గోలి శ్రీరాములు పాల్గొన్నారు.

పారిశుధ్య నివారణకు శ్రద్ధ తీసుకోవాలి



గండేపల్లి: మురారిలో పారిశుధ్య నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్

గండేపల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నివారణపై ప్రతీ ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛదివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మురారి, గండేపల్లి, మల్లేపల్లి గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులకు పారిశుధ్య నివారణపై.. తడిచెత్త, పొడిచెత్త వేరు చేసే విధానంపై వివరించారు. చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. మురారి ఉపసర్పంచ్ జాస్తి వసంత్, వి.రవికుమార్, ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, కార్యదర్శి శిరీష పాల్గొన్నారు. ఎన్టీరాజాపురం గ్రామంలో కార్యదర్శి టీవీ రామ్‌నాథ్ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు.

తడి, పొడి చెత్త సేకరణ

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో తడి, పొడి చెత్త సేకరణ కార్యక్రమాన్ని శనివారం సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి ప్రారంభించారు. చెత్తతో సంపద సృష్టించవచ్చని, చెత్త సేకరణలో గ్రామస్తులు అధికారుల ఆదేశాలను పాటించాలని కోరారు. గ్రామపురవీధుల్లో కార్యదర్శి భావరాజు కామరాజు ఆధ్వర్యంలో సిబ్బంది చెత్త సేకరణ చేపట్టారు.

చెత్తను వేర్వేరుగా సేకరించాలి

జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను సేకరించే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రత్తిపాడులో జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. ఇలా వేరు చేసిన చెత్త ద్వారా సంపద తయారు చేసే కేంద్రం లేకపోవడంతో వర్మీ కంపోస్టు షెడ్డుకు స్థలం కేటాయించాలని తహసీల్దార్‌కు పంచాయతీ ద్వారా లెటర్ రాయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉన్న చెత్తను తొలగించాలి

ఏలేశ్వరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతే లక్ష్యంగా గ్రామాల్లో ఉన్న చెత్తను తొలగించాలని ఎంపీడీవో సూర్యనారాయణ అన్నారు. శనివారం లింగంపర్తి, భద్రవరం, యర్రవరం, రమణయ్యపేట గ్రామాల్లో ఎంపీడీవో, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది కలిసి ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది ఇళ్ల వద్ద, దుకాణాల వద్ద తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామాల్లో ఉన్న సంపద కేంద్రాలకు తరలించారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

తుని రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని డీఎల్‌పీవో బాలమణి స్పష్టం చేశారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక డ్రైవ్ తేటగుంటలో చేపట్టారు. డీఎల్పీవో పంచాయతీ కార్యదర్శి లక్ష్మితో కలిసి పారిశుధ్య పనులను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో విస్తరణాధికారి గుడివాడ మరిడయ్య ఉన్నారు.

శివరాత్రికి ఏర్పాట్లు

జగ్గంపేట, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ఇర్రిపాకలో ఏలేరు నది ఒడ్డున ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో మహాలింగాన్ని ప్రతిష్ఠించారు. శివరాత్రి పర్వదినాన అధిక సంఖ్యలో భక్తులు ఈప్రాంతానికి వచ్చి ఏలేరు నదిలో స్నానాలు ఆచరించడానికి, పూజలకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

శివరాత్రికి ఏర్పాట్లు

దేవీపట్నం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రికి ముంపు గ్రామమైన దేవీపట్నం గ్రామంలో గోదావరి స్నానాలు ఆచరించేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. 20 శతాబ్దాల క్రితం దేవీపట్నం గోదావరినదీ తీరంలోని చోళ్లరాజులు నిర్మించిన ఉమాచోడేశ్వరస్వామి ఆలయంవద్ద గతంలో భారీ ఎత్తు న ఉత్సవాలు నిర్వహించేవారు. ఈ సంవత్స రం ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలుతీసుకుంటున్నారు. దీనిలో భాగంగా ఆలయాన్ని శుభ్రపరుస్తున్నారు.

వీధిలైట్లు ఏర్పాటు

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని దూసరపాము పంచాయతీలో సర్పంచ్ చీడి శివ ఆధ్వర్యంలో శనివారం వీధిలైట్లు ఏర్పాటు చేశారు. పంచాయతీలోని సుబ్బంపాడు, ఎర్రంపాడు, దూరపాము గ్రామాల్లో యుద్ధప్రాతిపదికన ప్రజల సౌకర్యార్థం వీధిలైట్లు ఏర్పాటుచేసినట్లు సర్పంచ్ చీడి శివ తెలిపారు. పంచాయతీలో ప్రతీ గ్రామంలో విద్యుత్ సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పౌష్టికాహార లోపం పిల్లలకు ప్రత్యేక వైద్య సేవలు

● డాక్టర్ మహేష్‌బాబు



కూనవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కూనవరం మండలం కోతుల గుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉన్న ఎన్ఆర్‌సీ కేంద్రంలో పౌష్టికాహార లోపం, బరువు తక్కువున్న పిల్లలకు, రక్తహీనతతో బాధపడే చిన్నారులకు ప్రత్యేక వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ మహేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల పరిధిలో ఉన్న గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలు, ఆయాలు ఇటు వంటి లోపాలు ఉన్న వారిని గుర్తించాలన్నారు. వారిని కోతులగుట్ట ఎన్ఆర్‌సీ కేంద్రానికి తరలించాలని కోరారు. ఈ లోపాలు ఉన్న పిల్లలకు, వారి తల్లిదండ్రులకు భోజన వసతితోపాటు రూ.100 ఇన్‌సెంటివ్ అందజేస్తామన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ఏలేశ్వరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద శనివారం ఎంప్లాయిస్ యూనియన్ నేతృత్వంలో నిరసన చేపట్టారు. సర్క్యులర్‌కి విరుద్ధంగా డ్రైవర్ ఎస్పీ రమణపై అక్రమ సస్పెన్షన్ పెట్టి విధుల నుంచి తొలగించడం సరికాదని, సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని ఎర్ర బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. దీనిపై మేనేజ్‌మెంట్ వెంటనే స్పందించి రమణను డ్యూటీలోకి తీసుకోవాలని, లేకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శంఖవరం, హంసవరం ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఏప్రిల్ 20న రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశపరీక్షలు నిర్వహించనున్నారని డీఈవో పి.రమేష్ తెలిపారు. ఈ ఏడాది 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఈనెల 24 నుంచి మార్చి 31 వరకూ దరఖాస్తుచేసుకోవాలన్నారు. వివరాలకు 949124 9321, 7032996442లో సంప్రదించాలన్నారు.

అన్ని సౌకర్యాలు కల్పించాలి

గండేపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షలు రాసే అభ్యర్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి అన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీని ఆమె శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షలకు 6,460మంది హాజరవుతారన్నారు. పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలపై సిబ్బందితో మాట్లాడారు. గండేపల్లి తహశీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పీడీ పరిశీలన

తొండంగి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటుచేసిన పోషక వాటికలను ఐసీడీఎస్ పీడీ విజయకుమారి శనివారం పరిశీలించారు. తొండంగిలో ఉన్న మూడు సెంటర్లకు ఒక సెంటర్లో పోషక వాటిక ఏర్పాటు చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే మిగిలిన రెండు సెంటర్లలో పోషక వాటిక ఏర్పాటుచేయాలని ఆదేశించారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

టమాటా రైతులకు అండగా ప్రభుత్వం

తొండంగి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): టమాటా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని హార్టికల్చర్ అధికారిణి విజయలక్ష్మి అన్నారు. శనివారం ఆమె ఏ.కొత్తపల్లి గోపాలపట్నం గ్రామాల్లో పర్యటించి టమాటా రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తుందని, ఆందోళనతో ఉత్పత్తులను నాశనం చేసుకోవద్దని కోరారు.

నేటి నుంచి షిరిడిసాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు

తొండంగి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బెండపూడిలో కొలువైన షిరిడీసాయి బాబా ఆలయ అష్టమ వార్షికోత్సవాలు ఆదివారం నుంచి నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు చెప్పారు. ఉదయం కాకాడ హారతి, విఘ్నేశ్వరపూజ, సహస్రపుష్పార్చణ తదితర పూజలు, కార్యక్రమాలు, అనంతరం అన్నదానం జరుగుతుందన్నారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ



అన్నవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో శనివారం ప్రాకార సేవ వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి బాజాభజంత్రీలతో తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొని వచ్చారు. భక్తుల గోవిందపామస్మరణలు, పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. ఈవో సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి

గ్రామ వ్యవసాయ సహాయకురాలు తన్మయి

జగ్గంపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలని గ్రామ వ్యవసాయ సహాయకురాలు పి.తన్మయి తెలిపారు. మండల వ్యవసాయ అధికారి శ్రీరామ్ ఆధ్వర్యంలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు జగ్గంపేట రైతు సేవ కేంద్రంలో 300మంది రైతులు రైతు విశిష్ట గుర్తింపు నమోదు చేసుకున్నారని ఇంకా 600మంది రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలని లేదంటే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలు నిలిపివేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి రైతు సచివాలయం 2 పక్కనే ఉన్న రైతు సేవా కేంద్రం వద్దకు వచ్చి పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నెంబర్ తీసుకు రావాలన్నారు. ఈరిజిస్ట్రేషన్ ఏపీ ద్వారా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ,వ్యవసాయ ఆధునికరణ యంత్రాలు, డ్రిప్ వంటి యంత్రాలు రాయితీ ద్వారా అందిస్తామన్నారు.